

ఖరీఫ్ ఎరువులు సిద్ధం



గత వైసీపీ ప్రభుత్వంలో రూ. కోట్లు ఖర్చు పెట్టి ఆర్‌బీకే భవనాలను ఏర్పాటు చేశారు. కియోస్క్ యంత్రాలను అందుబాటులోకి తెచ్చారు. అయితే రైతులకు అవసరమైన ఎరువులను మాత్రం సప్లయ్ చేయలేకపోయారు. దీంతో రైతులు ప్రైవేటు డీలర్లను ఆశ్రయించక తప్పలేదు. ఏటా ఖరీఫ్‌లో కర్నూలు జిల్లాలో వివిధ కాంప్లెక్స్ ఎరువులు, డీఏపీ యూరియా దాదాపు మూడున్నర లక్షల మెట్రిక్ టన్నులు అవసరమవుతాయని వ్యవసాయ శాఖ అధికారుల అంచనా. ఈ ఎరువులను రైతులకు పూర్తి స్థాయిలో అందుబాటులోకి తెచ్చే బాధ్యత మార్క్‌ఫెడ్ సంస్థ చూసుకుంటోంది.

- సప్లయ్ కోసం అన్ని సొసైటీలకు లైసెన్స్‌లు జారీ
- ప్రతి గ్రామంలోనూ అందుబాటులో ఎరువులు: మార్క్‌ఫెడ్ డీఎం రాజు

కర్నూలు అగ్రికల్చర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): కర్నూలు, నంద్యాల జిల్లాలో 99 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు, 45 డీసీఎంఎస్ కేంద్రాలు ఉన్నాయి. గతంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు పూర్తి స్థాయిలో ఎరువులను సప్లయ్ చేశారు. మార్క్‌ఫెడ్ సంస్థ 99 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు లైసెన్స్‌లను జారీ చేసింది. బ్యాంకు గ్యారెంటీలను కూడా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అందించింది. దీంతో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లోని రైతులంతా తమకు అవసరమైన ఎరువులను ఏ మాత్రం ఇబ్బంది లేకుండా తీసుకున్నారు. వైసీపీ ప్రభుత్వంలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు, డీసీఎంఎస్ కేంద్రాలకు ఎరువుల సప్లయ్‌ను పూర్తిగా తగ్గించేశారు. ఆర్‌బీకేలకు ఎరువులను అందిస్తున్నామని, రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని చెప్పుకోవడం తప్పితే.. ఏ ఆర్‌బీకే కేంద్రాలకు పూర్తిస్థాయిలో ఎరువులను అందించలేకపోయారు. ఆర్‌బీకే కేంద్రాల్లో సిబ్బంది కూర్చొనేందుకు కూడా స్థలం లేని పరిస్థితుల్లో ఎరువులను తెచ్చి ఎక్కడ నిల్వ చేయాలో ఆ కేంద్రాల సిబ్బందికి దిక్కు తెలియడం లేదు.

ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రైతులకు అవసరమైన ఎరువులను పూర్తి స్థాయిలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు, డీసీఎంఎస్‌ల ద్వారా రైతులకు అందించాలని ఆదేశాలు జారీ చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఎరువుల కొరత రానీయం

గ్రామాల్లో రైతులకు సరిపడ అన్ని రకాల ఎరువులను మార్క్‌ఫెడ్ సంస్థ ద్వారా వచ్చే ఖరీఫ్‌కు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. సహకార బ్యాంక్ గ్యారెంటీ అందిస్తోంది. యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ తదితర ఎరువులకు కొరత లేదు. ఎంఆర్‌పీ ధరకే ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు, డీసీఎంఎస్ కేంద్రాల్లో ఎరువులను రైతులకు అందుబాటులోకి ఉంచుతున్నాం. - రాజు, మార్క్‌ఫెడ్ కర్నూలు మేనేజర్

పేదరిక నిర్మూలనే ముఖ్యమంత్రి లక్ష్యం

- బడుగువర్గాల అభ్యున్నతికి కృషి
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి
- ఘనంగా చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలు

కర్నూలు, అర్బన్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేదరిక నిర్మూలనే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, మాజీ మంత్రి కేఈ ప్రభాకర్, మాజీ ఎంపీ సంజీవ్‌కుమార్‌తో కలిసి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం కేక్ కట్‌చేసి సంబ రాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 22 ఏళ్ల వయస్సులోనే రాజకీయ జీవితం ప్రారంభించి సీఎంగా ఉమ్మడి తెలుగురాష్ట్రానికి అత్యధిక కాలం పనిచేసిన అరుదైన అవకాశం సొంతం చేసుకున్నారని కొనియాడారు. బడుగువర్గాల అభ్యున్నతికి ఆనాటి నుంచి నేటి వరకు వారి కోసం అహర్నిశలు పనిచేశారని గుర్తు చేసుకున్నారు. నిరుద్యోగ యువకుల కోసం తన జన్మదిన కానుకగా 16,345 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకోసం నోటిఫికేషన్ జారీచేశారని, గతంలో 1995-99 కాలంలో సీఎంగా80 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీచేశారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకెపోగు ప్రభాకర్, రాష్ట్ర కార్యదర్శి నాగేశ్వరరావు యాదవ్, కేఈ జగదీష్, నంద్యాల నాగేంద్ర, ధరూర్ జేమ్స్, పోతురాజు రవీకుమార్, తదితరులు పాల్గొన్నారు.



చంద్రబాబు జన్మదిన వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

సీఎం చంద్రబాబును చూసి ఎంతో నేర్చుకోవాలి

- జన్మదిన వేడుకల్లో పరిశ్రమల శాఖ మంత్రి
- రక్తదానం చేసిన టీజీ భరత్, ఎంపీ నాగరాజు

కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును చూసి తాను ఎంతో నేర్చుకోవాల్సి ఉందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. సీఎం చంద్రబాబు 75వ పుట్టిన రోజు సందర్భంగా నగరంలోని గౌరిగోపాల్ హాస్పిటల్ సమీపంలో ఉన్న అక్షయ బ్లడ్ బ్యాంకులో మంత్రి రక్తదానం చేశారు. అంతకు ముందు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సీఎం చంద్రబాబు పుట్టినరోజు సందర్భంగా కేక్‌ను కట్‌చేశారు. మంత్రి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన 10 నెలల్లోనే రూ.8.50 లక్షల కోట్ల పెట్టుబడులు కేవలం సీఎం చంద్రబాబు బ్రాండ్‌తోనే రాష్ట్రానికి వచ్చాయన్నారు. మంత్రితో పాటు కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, పలువురు నాయకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో 'కుడా' ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ ముంతాజ్, కార్పొరేటర్లు కైపా పద్మలతరెడ్డి, కురువ పరమేష్, గౌరిగోపాల్ హాస్పిటల్ ఈడీ డా.శ్రీకాంత్ రెడ్డి, అక్షయ బ్లడ్ బ్యాంక్ డైరెక్టర్లు డా.శ్రీకాంత్ రెడ్డి, డా.అనంత, డా.గంగాధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


అక్షయ బ్లడ్ బ్యాంకులో రక్తదానం చేస్తున్న మంత్రి టీజీ భరత్, ఎంపీ నాగరాజు

మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల



- ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2645 ఉపాధ్యాయ పోస్టులు
- స్కూల్ అసిస్టెంట్లు 828, ఎస్‌జీటీలు 1817
- ఉపాధ్యాయ అభ్యర్థులకు సీఎం చంద్రబాబు పుట్టిన రోజు కానుక
- నిరుద్యోగుల హర్షం

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ నియామకాలకు సంబంధించి మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలపై ఉపాధ్యాయ అభ్యర్థులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. ఎన్నికల ముందు మెగా డీఎస్సీని నిర్వహిస్తామని ఇచ్చిన మాటను నిలుపుకోవడంలో ముఖ్యమంత్రి చంద్రబాబుకే సాధ్యమైందని నిరుద్యోగులు అంటున్నారు. నిరుద్యోగులకు ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ ఫైల్‌పై మొదటి సంతకం చేశారు. ఆ వెంటనే ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)ను నిర్వహించి ఫలితాలు విడుదల చేశారు. ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో టెక్నికల్ సమస్యలు తలెత్తడంతో డీఎస్సీ నోటిఫికేషన్ నిర్వహించడంలో కొంత కాలయాపన జరిగింది. సీఎం చంద్రబాబు పుట్టినరోజు కానుకగా మెగా డీఎస్సీ నోటిఫికేషన్ షెడ్యూల్‌ను రాష్ట్ర విద్యా వనరుల శాఖ మంత్రి ఆదివారం ప్రకటించారు. ఈ నెల 20వ తేదీ నుంచి డీఎస్సీ ప్రక్రియను కొనసాగుతుందని నారా లోకేశ్ తెలిపారు. డీఎస్సీ షెడ్యూల్ ప్రకారం ఏప్రిల్ 20 నుంచి మే 15వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతుంది. ఏప్రిల్ 20 నుంచి మే 14వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా ఫీజుల చెల్లింపులు, దరఖాస్తుల స్వీకరణ ముగింపు గడువు ప్రకటించారు. మే 20వ తేదీన మాక్‌టెస్టు జరుగుతుంది. మే 30వ తేదీ నుంచి అభ్యర్థులు హాల్‌టికెట్‌ను డౌన్‌లోడు చేసుకోవచ్చు. జూన్ 6 నుంచి జూలై 6వ తేదీ వరకు కంప్యూటర్ బెస్ట్ విధానంలో ఆన్‌లైన్ పరీక్షలు కొనసాగుతాయి. అన్ని పరీక్షలు పూర్తయిన వెంటనే రెండు రోజుల్లో ప్రాథమిక కీ విడుదల చేస్తారు. ప్రాథమిక కీ విడుదల అనంతరం 7 రోజుల పాటు అభ్యంతరాల స్వీకరణ, తుది కీ విడుదలైన ఏడు రోజుల తర్వాత మెరిట్ జాబితా కీ విడుదల జరుగుతున్నట్లు నోటిఫికేషన్ షెడ్యూల్‌లో ప్రకటించారు. డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటిస్తారని చెప్పి వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి నిరుద్యోగులను మోసం చేశారు. కూటమి ప్రభుత్వం నిరుద్యోగుల కలలను నిజం చేస్తోంది. ఎన్నికల ముందు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు మెగా డీఎస్సీ నిర్వహిస్తాననీ హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు ప్రభుత్వం చేపట్టిన మొదటి ఫైల్ పైన మెగా డీఎస్సీ 16,347 పోస్టులతో సంతకం చేసి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. 2024 సంవత్సరం అక్టోబరు 3 నుంచి 21వ తేదీ వరకు టెట్ ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించి ఆఘమేఘాల మీద టెట్ ఫలితాలు కూడా ప్రకటించారు. ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు మొత్తం 54,083 మంది టెట్‌కు హాజరయ్యారు.

పకడ్బందీగా డీఎస్సీ నిర్వహణ



ప్రతిష్ఠాత్మకంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న మెగా డీఎస్సీ నిర్వహణను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపట్టాం. ఈసారి అభ్యర్థులు ఎన్ని సబ్జెక్టులైనా డీఎస్సీ రాసుకునేందుకు అవకాశం కల్పించింది. అయితే.. దరఖాస్తుల చేసుకునే సమయంలోనే ఆయా ఉద్యోగాలకు ప్రియారిటీ పరంగా ఆప్షన్లు ఎంచుకోవాల్సి ఉంది. దీని ప్రకారమే మెరిట్ అభ్యర్థులకు ఉద్యోగ నియామకాలు ఉంటాయి. డీఎస్సీలో మెరిట్ వచ్చిన అభ్యర్థులకు రిజర్వేషన్, రోస్టర్‌లో 1:1 ప్రకారం నేరుగా అభ్యర్థులను ఎంపిక చేసి ఉద్యోగ నియామక ఉత్తర్వులను అందజేస్తారు. ఎవరైనా అభ్యర్థులు గ్రాజులైతే కింద మెరిట్ ప్రకారంగా అభ్యర్థులకు ఉద్యోగ ఉత్తర్వులు పంపుతారు. షెడ్యూల్ ప్రకారం డీఎస్సీ పరీక్ష ఫీజుల చెల్లింపులు, దరఖాస్తుల సమర్పణ, పరీక్ష నిర్వహణ వంటి వివరాలను డీఎస్సీ వెబ్‌సైట్‌లో ఉంచాం.
- శామ్యూల్‌పాల్, డీఈవో, కర్నూలు

ఉమ్మడి జిల్లాలో 2645 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ

జిల్లా పరిషత్, ప్రభుత్వ, మున్సిపాలిటీ, కార్పొరేషన్ పాఠశాలలో అన్ని కేటగిరీలో కలిపి కర్నూలు ఉమ్మడి జిల్లాలో ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్ల పోస్టులు మొత్తం 2645 ఖాళీలు ఉన్నాయి. ఇందులో స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 828, ఎస్‌జీటీ పోస్టులు 1817 ఉపాధ్యాయ ఖాళీలు ఉన్నాయి. ఇవి కాక గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో మరో 33 ఉపాధ్యాయ ఖాళీలు చూపారు. ఇందులో ఎస్‌జీటీలు 10 కాగా, మిగిలిన పోస్టులు 23 ఉన్నాయి.

ఉచిత శిక్షణ: రాష్ట్ర ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖల ద్వారా నిరుపేదలైన నిరుద్యోగుకు ఉచిత డీఎస్సీ కోచింగ్ ప్రభుత్వం చెప్పిస్తోంది. శిక్షణ పొందిన నిరుద్యోగులకు ఆయా సంక్షేమ శాఖల ద్వారా శిక్షణ, స్టయిఫండ్‌తో పాటు ఉచితంగా డీఎస్సీ మెటీరియల్‌ను సరఫరా చేస్తుంది. ఉచిత కోచింగ్ నిరుద్యోగులకు సువర్ణ అవకాశం.

యేసు మార్గంలో నడవాలి

- క్రైస్తవ మత పెద్దలు
- చర్చిల్లో క్రైస్తవుల ప్రార్థనలు
- భక్తి శ్రద్ధలతో ఈస్టర్ వేడుకలు

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): యేసు క్రీస్తుచూపిన మార్గంలో నడిచి అందరూ శాంతియుతంగా జీవించాలని క్రైస్తవ మతపెద్దలు ఉద్బోధించారు. ఆదివారం జిల్లాలోని క్రైస్తవులు క్రీస్తు ప్రభువు సమాధి నుంచి పునరుత్థానమై లేచిన వేడుక 'ఈస్టర్'ను ఘనంగా నిర్వహించుకున్నారు. వివిధ చర్చిలను ప్రత్యేకంగా అలంకరించారు. క్రైస్తవులు తమ గృహాలకు సమీపంలోని చర్చిలకు వెళ్లి ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈస్టర్ వేడుకను సంతోషంగా జరుపుకొన్నారు. చర్చిల సంఘ కాపరులు, మతపెద్దలు ఈస్టర్ ప్రార్థనలు చేసి, భక్తులకు ఈస్టర్ దైవ సందేశాన్ని అందజేశారు. క్రీస్తు ప్రభువు సమాజంలో శాంతియుతంగా జీవించేందుకు అనేక బోధనలు చేశారని, వాటిని అనుసరిస్తూ కరుణ, దయామయ జీవనంతో అన్నివర్గాల వారు సుఖశాంతులతో జీవించాలని మతపెద్దలు ఉద్బోధించారు. పరస్పర ప్రేమ, సహకార గుణాలతో కలిసి ఉన్న సమాజం ఆదర్శవంతంగా నిలుస్తుందని చెప్పారు.


కోల్స్ సెంటీనియల్ తెలుగు బాప్టిస్టు చర్చిలో దైవ సందేశం ఇస్తున్న ఎ. విక్టోరియా విజయ్ హాజరైన క్రైస్తవులు

బంగారు అంబారీపై ప్రహ్లాదరాయలు



బంగారు అంబారీపై విహరిస్తున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘ వేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు బంగారు అంబారీపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆదివారం చైత్ర సప్తమి శుభదినాన్ని పురస్కరించుకొని శ్రీ మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచే రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి, మంచాలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళ వాయిద్యాల మధ్య వెండి గజవాహనంపై స్వర్ణఅంబారిలో ప్రహ్లాదరాయలను అధి ష్ఠించి పీఠాధిపతి మహా మంగళహారతితో ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. గజవాహనం ఊరే గుతుండగా భక్తులు జయహో.. గురు రాఘ వేంద్ర.. విజయహో.. అంటూ పెద్దఎత్తున జయధ్వనులతో మఠం ప్రాంగణం మార్మో గింది. పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు వివి .ధ రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున వచ్చిన భ క్తులకు ఫల, పుష్ప, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు.

పిడుగుపాటుకు ముగ్గురి మృతి

- నలుగురికి గాయాలు
- కర్నూలు జిల్లాలో వేర్వేరు చోట్ల ఘటనలు

ఎమ్మిగనూరు రూరల్/పెద్దకడుబూరు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో వేర్వేరు చోట్ల పిడుగుపాటుకు ముగ్గురు మృతిచెందగా.. నలుగురు గాయపడ్డారు. వివరాలివీ.. పెద్దకడుబూరు మండలంలోని హనుమాపురం గ్రామానికి చెందిన గొల్ల కొత్తూరు ఈరన్న(28) భార్య గర్భిణి. సోమవారం తన భార్య ప్రసవం అవుతుందని వైద్యులు తెలపడంతో ఎమ్మిగనూరు మండలంలోని గుడికల్లు కొండలో వెలసిన సుశీలమ్మకు పూజ చేసేందుకు కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి వెళ్లాడు. పూజ ముగించుకొని వస్తుండగా సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. మార్గమధ్యలో వారు నడుచుకుంటూ వస్తుండగా పిడుగు పడడంతో ఈరన్న అక్కడికక్కడే మృతి చెందాడు. ఈరన్నతో పాటు ఉన్న మరో నలుగురికి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కుటుంబ సభ్యులు, బంధువులు రోదిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుడికల్లు సమీపంలో..

ఎమ్మిగనూరు మండలంలోని గుడికల్లు సమీపంలో పెద్దకడుబూరు మండలం హెచ్. మురవణి గ్రామానికి చెందిన గొర్రెల కాపరి అడివన్న(50) పిడుగుపాటుతో మృతి చెందారు. పనినిమిత్తం పట్టణ సమీపంలో ఉన్న హేమంత్ వైన్స్ దగ్గరకు వచ్చి ప్రమాదవశాత్తు మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఎమ్మిగనూరు రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


ఈరన్న (ఫైల్)


అడివన్న మృతదేహం

చిప్పగిరిలో పిడుగు పడి వ్యక్తి మృతి

చిప్పగిరి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): చిప్పగిరిలోని ఉల్లిగమ్మ దేవాలయం వెనక పిడుగు పడటంతో శివన్న అనే రైల్వే రిటైర్డ్ ఉద్యోగి మృతి చెందారు. ఆదివారం సాయంత్రం 6 గంటల నుండి ఎనిమిది గంటల వరకు ఈదురు గాలులు ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఆ సమయంలో పశువులకు మేతవేయడానికి వెళ్లిన శివన్న పశువులపాకలో ఉన్నారు. అదే సమయంలో పిడుగు చెట్టుపై పడడంతో చెట్టుకొమ్మ విరిగిపోయింది. చెట్టు శివన్నపై పడడంతో ఇక్కడ అక్కడే మృతి చెందాలని స్థానికులు తెలిపారు. శివన్నకు ముగ్గురు కూతుర్లు, కుమారుడు ఉన్నారు.

కళాకారులకు సీఎం చంద్రబాబు పెద్దపీట

- ప్రముఖ అష్టావధాని ఆముదాల మురళి
- కర్నూలు టీజీవీ కళాక్షేత్రంలో ప్రారంభమైన చంద్రబాబు జన్మదిన వజ్రోత్సవాలు

7

పేదరిక నిర్మూలనే సీఎం లక్ష్యం

● చంద్రబాబు జన్మదిన వేడుకల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు


హుసేనాపురంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, టీటీడీ బోర్డు సభ్యులు మల్లెల రాజశేఖర్


పత్తికొండలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు


మంత్రాలయం మండలం మాధవరంలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, నాయకులు

పేదరికం లేని రాష్ట్రమే సీఎం చంద్రబాబు నాయుడు లక్ష్యమని, ఆ మేరకు నిరంతం ఆయన కృషి చేస్తున్నారని ప్రజాప్రనిధులు అన్నారు. కర్నూలు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. వారు మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం ముందుకెళ్తున్నారని అన్నారు. చంద్రబాబు సారథ్యంలో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.


నందికొట్కూరు రూరల్: కొణిదేలలో కేక్ కట్ చేస్తున్న ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి


ఎమ్మిగనూరులో సీఎం చంద్రబాబు పుట్టిన రోజు సందర్భంగా పట్టణంలోని బైక్‌ర్యాలీ చేస్తున్న ఎమ్మెల్యే బీవీ, నాయకులు


నందికొట్కూరు టీడీపీ కార్యాలయం వద్ద వృద్ధురాలితో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య


డోన్: ఎంఎస్ఆర్ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న ధర్మవరం సుబ్బారెడ్డి


ఆలూరులో కేక్ కట్ చేస్తున్న వీరభద్రగౌడ్

క్రీడల్లో అద్వితీయ ప్రతిభ

● అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా పని చేస్తూనే పారా క్రికెట్, పారా త్రో బాల్ పోటీల్లో రాణింపు

● ఆరేళ్లుగా ఆంధ్ర పారా క్రికెట్ జట్టు కెప్టెన్‌గా కొనసాగుతున్న కైలాస్‌రెడ్డి


అంతర్జాతీయ పారా త్రోబాల్ పోటీల్లో సాధించిన బ్రాంజ్ మెడల్‌తో కైలాస్‌రెడ్డి

నంద్యాల హాస్పిటల్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): అంగవైకల్యం ఆయన ముందు చిన్నబోయింది. సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన కైలాస్‌రెడ్డి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అద్వితీయమైన ప్రతిభ కనబరుస్తూ నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు. చిన్ననాటినుంచి క్రికెట్ ఆటపై ఆసక్తి ఉండటంతో దివ్యాంగుడైన కైలాస్‌రెడ్డి కఠోర శ్రమతో రాష్ట్ర, జాతీయస్థాయికి ఎంపికయ్యారు. తన క్రీడా ప్రస్థానంలో తండ్రితోపాటు అన్న వెంకటరెడ్డి, భార్య రాజేశ్వరి ఇచ్చిన ప్రోత్సాహంతో అంతర్జాతీయ స్థాయిలో భారత కీర్తి పతాకాన్ని ఎగురవేశారు. క్రికెట్‌లో కెప్టెన్‌గా ఉత్తమ క్రీడాకారుడిగా కీర్తిప్రతిష్టలు సాధించడంతో పాటు ఇటీవల జరిగిన పారా త్రో బాల్ చాంపియన్‌షిప్‌ను భారత జట్టుకు రజత పతకాన్ని సాధించడంలో కీలకపాత్ర పోషించారు. గండా కైలాస్‌రెడ్డిది నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల గ్రామం. తల్లిదండ్రులు పెద్దిరెడ్డి, వెంకటపుల్లమ్మ, అన్న వెంకటరెడ్డి. సాధారణ రైతు కుటుంబంలో జీవనం సాగిస్తున్న కైలాస్‌రెడ్డి విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ గనులు, భూగర్భశాఖలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా అవుట్ సోర్సింగ్ కింద పనిచేస్తున్నారు. జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు ఆర్థికంగా తన తోటి ఉద్యోగుల సహకారంతో అంచలంచెలుగా ఎదిగి భారత పారా త్రో బాల్ జట్టుకు ఎంపికయ్యారు. 2025 మార్చి 28 నుంచి 30 వరకు కాంబోడియా దేశంలో జరిగిన ఆసియా పారా త్రో బాల్ చాంపియన్‌షిప్‌లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. 8 దేశాలు పాల్గొన్న ఈ చాంపియన్‌షిప్‌లో భారత జట్టు రజత పతకం సాధించింది.


ఇండియా జట్టుతో కైలాస్‌రెడ్డి (ఫైల్)


ఆంధ్ర జట్టు కెప్టెన్‌గా సాధించిన కప్పుతో కైలాస్‌రెడ్డి (ఫైల్)

గ్రామీణ ప్రాంతం నుంచి పారా క్రికెట్ ఆంధ్ర జట్టుకు గత ఆరేళ్ల నుంచి కెప్టెన్‌గా వ్యవహరించడమే కాకుండా త్రో బాల్ భారత జట్టుకు ఎంపిక కావడంపై పలువురు ప్రశంసిస్తున్నారు. సరైన సౌకర్యాల్లేని గ్రామం నుంచి ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పాల్గొనడం విశేషం. ఆయనకు సాయి ప్రణీత్, యశస్విని సంతానం.

క్రీడా ప్రస్థానం ఇలా..: 2012లో శ్రీలంకలో జరిగిన ట్రై సిరీస్ క్రికెట్ పోటీలకు భారతజట్టు తరఫున ప్రాతినిధ్యం. ఈ టోర్నమెంట్‌లో భారత జట్టు మూడు మ్యాచ్‌లు గెలిచి సిరీస్ కైవసం చేసుకుంది. 2014లో రెస్టాఫ్ ఇండియా క్రికెట్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తూ బరోడా, విదర్భాలలో అంతర్జాతీయ పారా క్రికెట్ పోటీల్లో పాల్గొన్నాడు. ఈ పోటీల్లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, బెస్ట్ ప్లేయర్ అవార్డులు అందుకున్నారు. 2025లో కాంబోడియా దేశంలో జరిగిన మొదటి ఆసియా పారా త్రో బాల్ చాంపియన్‌షిప్‌లో భారత జట్టుకు ప్రాతినిధ్యం. ఈ టోర్నీలో భారత జట్టు రజత పతకం సాధించింది.

ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యం

క్రీడా కోటాలో ప్రభుత్వ ఉద్యోగం సాధించడమే లక్ష్యం. బీకాం (కంప్యూటర్స్) పూర్తి చేశాను. గత 16 ఏళ్ల నుంచి అవుట్ సోర్సింగ్ కింద గనుల శాఖలో పనిచేస్తున్నా. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం స్పోర్ట్స్ కోటా 2నుంచి 3శాతానికి పెంచి క్రీడాకారులకు ఉద్యోగావకాశాలు కల్పించిన సీఎం చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు. ప్రస్తుతం స్పోర్ట్స్ కోటాలో నేరుగా గ్రూప్-2 ఉద్యోగం వస్తుందనే నమ్మకంతో ఉన్నా.

- కైలాస్‌రెడ్డి

అభివృద్ధిని పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో వెనుకబడిన జిల్లాల అభివృద్ధిని రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఎస్వీ కాంప్లెక్స్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లారు. ఏపీ ఫుల్ ఫామ్ అంటే కూటమి ప్రభుత్వానికి ఏ అంటే అమరావతి పీఅంటే పోలవరం కనిపిస్తుం దన్నారు. కూటమి ప్రభుత్వానికి అమరావతి, పోలవరంపైనే ఎక్కువ ప్రేమ చూపిస్తున్నారని విమర్శించారు. కానీ రాష్ట్రంలో వెనుకబడిన జిల్లాల అభివృద్ధి శూన్యమన్నారు. రాష్ట్రంలో 4 వేల కోట్లు ఖర్చు చేస్తే రాష్ట్రం లోని అన్ని ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తి అవుతాయన్నారు. వైసీపీ కార్పొరేటర్లు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతిభకు పురస్కారాలు

నంద్యాల కల్చరల్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని పద్మశాలీయ కులానికి చెందిన విద్యార్థులకు జూన్ 1వ తేదీన ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్నట్లు పద్మశాలీయ సంఘ అధ్యక్షుడు భీము నిపల్లె వెంకటసుబ్బయ్య తెలిపారు. ఆదివారం భద్రావతీ భావనాఋషి ఆలయంలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా పద్మశాలీయ సంఘం నాయకులు మాట్లాడుతూ పదో తరగతిలో 540మార్కులు, ఇంటర్‌లో 900మార్కులు పైన సాధించిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మెరిట్ ఆధారంగా ప్రథమ, ద్వితీయ, తృతీయ, కన్సోలేషన్ బహుమతులుగా వరుసగా రూ.10000, రూ.7500, రూ.5,000, రూ.2000 అందజేస్తామన్నారు. వివరాలకు మంగపతి సెల్ నెంబర్: 939045889కు సంప్రదించాలన్నారు. ఈనెల 15లోపుల మార్క్‌లిస్టు, కులధృవీకరణ పత్రం, ఆధార్‌కార్డు జిరాక్స్ ప్రతులను అందజేయాలన్నారు.

సీఎం జన్మదిన వేడుకల్లో విషాదం

● గుండెపోటుతో టీడీపీ నాయకుడి మృతి


సురేంద్ర నాయుడు(ఫైల్)

ఆలూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : తెలుగు యువత జిల్లా అధికార ప్రతినిధి అటికెలగుండు సురేంద్ర నాయుడు(30) ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. చంద్రబాబు జన్మదినం సందర్భంగా టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్‌తో కలిసి ర్యాలీలో పాల్గొని వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసి నినాదాలు చేశారు. అనంతరం వాంతులు కావడంతో ఒక్కసారిగా గుండెపోటు రావడంతో ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గుమ్మనూరు నారాయణ, టీడీపీ యువనేత గిరి మల్లేష్, గౌడ్, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వెకుంఠం శివప్రసాద్, సీనియర్ నాయకులు జయ రామ్, శేషగిరి నివాళులర్పించారు. సురేంద్ర మృతి పట్ల వీరభద్ర గౌడ్ కన్నీటి పర్యంతరమయ్యాడు. టీడీపీ కార్యాలయంలో సురేంద్ర మృతి పట్ల 5 నిమిషాల మౌనం పాటించారు. సోమవారం టీడీపీ కార్యాలయం నుంచి పార్థివ దేహాన్ని ఊరేగింపు నిర్వహిస్తామని తెలిపారు.

సొంతూరికి సేవ చేయడం అభినందనీయం

● పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్

● స్కాలర్‌షిప్ చెక్కుల అందజేత


చెక్కు అందజేస్తున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు అర్బన్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): విదేశాల్లో ఉంటూ సొంతూరికి సేవ చేయడం అభినందనీయమని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. ఆదివారం నగరంలోని ఉస్మానియా కళాశాల రోడ్డులో ఉన్న టీజీ వెంకటేష్ మైనార్టీ షాదీఖానాలో అమాన స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఎన్ఆర్ఐ ఫహాద్ ఏర్పాటుచేసిన స్కాలర్‌షిప్ పంపిణీకి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 25 మంది పేద విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.20వేల చెక్కును అందించారు. ఈ సందర్భంగా సొంతూరికి సేవ చేయాలన్న ఫహాద్ ఆలోచన ఎంతో గొప్పదని మంత్రి భరత్ కొనియాడారు. ఆయన ఈప్రాంతంలో కట్టిన బ్యానర్లు వైసీపీ నాయకులు చింపివేడయం మంచి సంప్రదాయం కాదన్నారు. పిచ్చి పనులు చేస్తే ఇది వైసీపీ ప్రభుత్వం కాదన్నారు. కర్నూలును అభివృద్ధి చేయాలన్నా ఆలోచనతో తాను ముందుకు వెళ్తున్నానని, మంచి పనులు చేస్తున్న తమను ఇబ్బంది పెడితే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. వక్స్ బోర్డు బిల్లు గురించి లేనిపోని అపోహలు సృష్టిస్తున్నారని మంత్రి తెలిపారు. వైసీపీ నాయకులు పనిలేక రాజకీయ లబ్ధికోసం ప్రజలను రెచ్చగొట్టే పనులు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో స్టేట్ హజ్ కమిటీ మెంబర్ మన్సూర్ అలీఖాన్, కార్పొరేటర్ కురువ పరమేష్, ముంతాజ్, శేషయాదవ్, జహంగీర్, మోహబూబ్ ఖాన్, జనసేన నాయకులు పవన్ పాల్గొన్నారు.

కళాకారులకు సీఎం చంద్రబాబు పెద్దపీట

● ప్రముఖ అష్టావధాని ఆముదాల మురళి

● కర్నూలు టీజీవీ కళాక్షేత్రంలో ప్రారంభమైన చంద్రబాబు జన్మదిన వజ్రోత్సవాలు

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కళలు, సాహిత్య రంగాలకు పెద్దపీట వేస్తూ సీఎం చంద్రబాబు కళాకారులను ప్రోత్సహిస్తున్నారని తిరుపతికి చెందిన ప్రముఖ అష్టావధాని, రాష్ట్ర ప్రభుత్వ కళారత్న పురస్కార గ్రహీత ఆముదాల మురళి అన్నారు. కర్నూలు నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో సీఎం నారా చంద్రబాబు నాయుడు 75వ జన్మదిన సందర్భంగా ఏర్పాటుచేసిన 'చంద్రబాబు జన్మదిన వజ్రోత్సవాలు' వారం రోజుల పాటు నిర్వహించనున్నారు. ఆదివారం ఈవేడుకలను ప్రారంభించారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు, కళారత్న అవార్డు గ్రహీత పత్తి ఓబులయ్య ఆధ్వర్యంలో, ఉగాది, కందుకూరి పురస్కారాలు అందుకున్న కళాకారులు, సాహితీవేత్తలు చంద్రబాబు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. అనంతరం భారీ కేక్‌ను కట్ చేసి ప్రేక్షకులకు పంపిణీ చేశారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు, కళారత్న అవార్డు గ్రహీత పత్తి ఓబులయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయ్యాక, రాష్ట్రంలోని ఎందరో కళాకారులకు ఉగాది, కందుకూరి పురస్కారాలు ఇచ్చి, కళారంగ పురోగతికి బాటలు వేశారని చెప్పారు. రానున్న కాలంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాటక కళాకారులకు, కళారంగానికి మరింత ప్రోత్సాహకాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. మురళి మాట్లాడుతూ తాను కళారత్న అవార్డు అందుకున్న తర్వాత తొలిసారిగా కర్నూలు నగరంలో మరో కళారత్న అవార్డు గ్రహీత పత్తి ఓబులయ్య ఆధ్వర్యంలో చేపట్టిన ఈ మహోత్తర కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా అష్టావధాని డాక్టర్ ఆముదాల మురళిని, సాహితీవేత్తలను ఘనంగా సత్కరించారు. ఆ కార్యక్రమంలో టీజీవీ కళాక్షేత్రం కార్యదర్శి మహమ్మద్ మియా, కార్యక్రమ కన్వీనర్లు డి. ఈశ్వరయ్య, సంగా ఆంజనేయులు, వాల్మీకి రాముడు, జీవీ శ్రీనివాసరెడ్డి, పి. రాజారత్నం, గాండ్ల లక్ష్మన్న, యాగంటీశ్వరప్ప తదితరులు పాల్గొన్నారు.

అలరించిన అష్టావధాన కార్యక్రమం..

చంద్రబాబు నాయుడు జన్మదిన వజ్రోత్సవ వారోత్సవాల్లో భాగంగా తొలిరోజు నిర్వహించిన అష్టావధాన కార్యక్రమం ఆహూతులను అలరింపజేసింది. ఇందులో డాక్టర్ ఆముదాల మురళి అష్టావధానిగా వ్యవహరించగా, పృచ్ఛకులుగా మారేడు రాముడు (దత్తపది), అవధా నం సుధాకరశర్మ (నిషిద్ధాక్షరి), ఎస్ఎస్ పటేల్ (సమస్య), ఇనాయ తుల్లా (అప్రస్తుత ప్రసంగం), పసుపులేటి నీలిమ (వర్ణన), డాక్టర్ కర్నాటి చంద్రమౌళిని (ఆశువు), మధుసూదనాచారి (నిస్తాక్షరి)లతో అష్టావధానిని ప్రశ్నల వర్షం సంధించారు. పృచ్ఛకుల ప్రశ్నలకు అలవోలకగా సమాధానాలు ఇస్తూ, సభలో చలోక్తులతో రంజింపజేస్తూ అవదాన కార్యక్రమం కొనసాగింది.

నేడు జగదేక సుందరి సామా పద్య నాటక ప్రదర్శన...

టీజీవీ కళాక్షేత్రంలో వారం రోజుల సాంస్కృతిక ప్రదర్శనల్లో భాగంగా సోమవారం సాయంత్రం 6 గంటలకు 'జగదేక సుందరి సామా' పౌరాణిక పద్య నాటకం ప్రదర్శిస్తున్నట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య తెలిపారు. దివంగత నాటక రచయిత పల్లేటి కులశేఖర్, కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య సంయుక్తంగా రాసిన ఈ నాటకానికి పత్తి ఓబులయ్యయ దర్శకత్వం మహించారు. నాటక ప్రదర్శనకు కన్వీనర్‌గా జీవీ శ్రీనివాసరెడ్డి వ్యవహరిస్తారు.


చంద్రబాబు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న పత్తి ఓబులయ్య తదితరులు


టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, కళాకారులతో సత్కారం పొందిన సాహితీవేత్తలు

ఈ-వ్యర్థాల పునర్వినియోగాన్ని సామాజిక బాధ్యతగా తీసుకోవాలి: మంత్రి


ర్యాలీలో పాల్గొన్న మంత్రి టీజీ భరత్, అధికారులు

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ఈ-వ్యర్థాల పునర్వినియోగాన్ని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. స్థానిక అశోక్‌నగర్‌లో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఈ-వ్యర్థాల నిర్వహణపై వార్డు కార్యదర్శులు, శానిటరీ కార్యదర్శులు, కార్మికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ చెత్తసేకరణ సమయంలోనే ఈ-వ్యర్థాలను విభజించి సంబంధిత కార్మికులకు అందజేయాలని, దీనివల్ల వాటిని రీసైక్లింగ్ పునర్వినియోగం సులభతరమవుతుందని అన్నారు. ఈ సందర్భంగా నగరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీ కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజనీర్ పీవీ కిషోర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ బి.నవ్య, మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, గ్రీన్ గ్లోబల్ రీసైక్లర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు నగర పాలకలో వినతుల స్వీకరణ

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): నగర పాలక కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతులను స్వీకరించనున్నట్లు కమిషనర్ రవీంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించే కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

26న నగర పాలక సర్వసభ్య సమావేశం

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): నగర పాలక సర్వసభ్య సమావేశం ఈనెల 26న నిర్వహిస్తున్నట్లు కమిషనర్ రవీంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మేయర్ బీవై. రామయ్య అధ్యక్షతన సమావేశం జరుగుతుందని, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యేలు గౌరుచరిత, బొగ్గుల దస్తగిరి, డిప్యూటీ మేయర్లు, స్టాండింగ్ కమిటీ సభ్యులు, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులకు 19 అంశాలతో కూడిన అజెండా ప్రతులను ఇప్పటికే పంపినట్లు ఆయన తెలిపారు.

ఏపీ ట్రెజరీ ఉద్యోగుల కార్యవర్గం ఎన్నిక

కర్నూలు కలెక్టరేట్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): జిల్లా ట్రెజరీ కార్యాలయం ఆవరణలో ఆదివారం ఏపీ ట్రెజరీ ఉద్యోగుల సర్వీస్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా కిరణ్ కుమార్ వ్యవహరించారు. జిల్లా అధ్యక్షుడిగా రవికుమార్, సహాయ అధ్యక్షుడిగా మహబూబ్ బాషా, ప్రధాన కార్యదర్శిగా గురుమూర్తి, ట్రెజరీగా సునీల్‌బాబు, ఉపాధ్యక్షులు, జాయింట్ సెక్రటర్లు, స్టేట్ కౌన్సిల్ మెంబర్లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వెంగల్ రెడ్డి నూతన సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

బస్సు లారీ ఢీ.. డ్రైవర్‌కు తీవ్రగాయాలు

కోడుమూరు రూరల్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి-కోడుమూరు మధ్య ఆదివారం మధ్యాహ్నం ఆర్టీసీ బస్సు లారీ ఢీకొన్నాయి. వివరాలివి.. డోన్ డిపో చెందిన బస్సు వెల్దుర్తి నుంచి ప్రయాణికులతో కోడుమూరుకు వస్తోంది. అయితే వెంకటగిరి గ్రామం దాటిన తర్వాత ఎదురుగా వస్తున్న లారీ, బస్సు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో బస్సు డ్రైవర్ బాషకు స్టీరింగ్ ఒత్తుకు పోవడంతో తీవ్రగాయాలయ్యాయి. మరో నలుగురు ప్రయాణికులకు స్వల్ప గాయాలైనట్లు తెలిసింది. డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం కర్నూలు తరలించినట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఓర్వకల్లులో దంచికొట్టిన వాన


ఓర్వకల్లు వీధుల్లో పారుతున్న వర్షం నీరు

ఓర్వకల్లు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లు, పూడిచెర్ల, నన్నూరు, గుట్టపాడు, పాలకొలను, చింతలపల్లె, పూడిచెర్ల తదితర గ్రామాల్లో ఆదివారం సాయంత్రం వడగండ్ల వాన దంచికొట్టింది. దీంతో ఓర్వకల్లు సమీపాన ఉన్న కుందూ వాగు నీటితో పొంగి పొర్లు తుంది. అలాగే గ్రామాల్లో వర్షం నీటితో వీధులు జలమయమ య్యాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వర్షం రాకతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎండ వేడిమికి ఈ వాన కాస్త ఉపశమనం కలిగించింది.

తాడిచెట్టుపై పడ్డ పిడుగు

కోడుమూరు రూరల్: మండలంలో ఆదివారం సాయంత్రం ఈదురుగాలులతో దుమ్ముధూళి రేగింది. ఈ సమయంలో విద్యుత్ సరఫరా కు అంతరాయం కలిగింది. గాలలకుతోడు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. గోరంట్ల లద్దగిరి రహదారిలో ఓ తాడిచెట్టుపై పిడుగుపడి పూర్తిగా కాలిపోయింది. ఘటనా ప్రదేశానికి సమీపంలో ఉన్న గొర్రెల కాపరులు పిడుగు శబ్దానికి భీతా హులయ్యారు.

క్రీడలతో మానసికోల్లాసం


ట్రోఫీ అందజేస్తున్న శ్రీచైతన్య విద్యాసంస్థల ఏజీఎం సురేష్, డీఎస్‌డీవో భూపతిరావు

కర్నూలు స్పోర్ట్స్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని శ్రీచైతన్య విద్యాసంస్థల ఏజీఎం సురేష్, డీఎస్‌డీవో భూపతిరావు అన్నారు. ఆదివారం నగర శివారులో సీఆర్ ఆర్ సెకండరీ చైతన్య స్కూల్ క్యాంపస్‌లో విద్యాసంస్థల ఫౌండర్ డాక్టర్ బీఎస్ రావు మెమోరియల్ జోనల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహిం చారు. జోనల్ పీఈటీ ఇన్‌చార్జి డీకే రవీందర్ రెడ్డి, ఆర్‌ఐలు రంగారెడ్డి, పీడీ వెంకటేశ్, సీతారామిరెడ్డి, రామాంజనేయులు, కేకే చౌదరి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు

టీడీపీ శ్రేణుల సంబరాలు

ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. వారు మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి సీఎం ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు. ఆయన ప్రతి ఒక్కరికీ ఆదర్శమని అన్నారు.

కల్లూరు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): సీఎం నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. ఆదివారం నంద్యాల చెక్‌పోస్ట్‌లో టీడీపీ శ్రేణుల సమక్షంలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, యువ నాయకుడు గౌరు జనార్దన్ రెడ్డితో కలిసి కేక్‌కట్ చేశారు. కర్నూలు మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ పెరుగు పురుషోత్తంరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. గౌరు చరిత మాట్లాడుతూ నిరుద్యోగులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న మోగా డీఎస్సీని సీఎం జన్మ దినం సందర్భంగా నోటిఫికేషన్ విడుదల చేయడం శుభపరిణామం అన్నారు. కార్యక్రమంలో నంద్యాల పార్లమెంట్ తెలుగు మహిళా అధ్యక్షురాలు కె.పార్వతమ్మ, ప్రభాకర్‌యాదవ్, బ్రాహ్మణపల్లె నాగి రెడ్డి, వి.జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

● నగరంలోని గుత్తి పెట్రోల్ బంక్ సమీపంలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత కేక్ కట్ చేశారు. ఆదివారం టీడీపీ నాయకులు పీయూ మాదన్న, గంగాధర్‌గౌడ్, క్యాతూరు మధు సమక్షంలో పార్టీ జెండాను ఎమ్మెల్యే ఆవిష్కరించారు.

● శరీన్‌నగర్ వైఎస్సార్ సర్కిల్‌లో ఎమ్మెల్యే గౌరు చరిత చంద్రబాబు జన్మదిన వేడుకల్లో భాగంగా కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, శైలజా యాదవ్ పాల్గొన్నారు.

● నగరంలోని హోమ్ ఆఫ్ హోప్ అనాథ శరణాలయంలో రాయలసీమ విద్యార్థి యువజన సంఘాల జేఏసీ చైర్మన్ బి.శ్రీరా ములు ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు నిర్వహిం చారు. ఎమ్మెల్యే తనయుడు గౌరు జనార్దన్‌రెడ్డితో కలిసి చిన్నపిల్లల సమక్షంలో కేక్‌కట్ చేశారు. అనంతరం దుస్తులు పంపిణీ చేశారు. ఆర్థిక సాయం అందించి, చిన్నారులకు మధ్యాహ్న భోజనం వడ్డిం చారు. కార్యక్రమంలో పాలకొలను సుధాకర్‌రెడ్డి, అయ్యస్వామి, రాజ న్న, నరసింహరాజు పాల్గొన్నారు.

ఉలిందకొండలో : కల్లూరు మండలం ఉలిందకొండలో టీడీపీ నాయకుడు ఈవీ.రమణ ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు నిర్వహించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేశారు. ఈసందర్భంగా ఈవీ.రమణ మాట్లాడుతూ భవిష్యత్తు తరాల అవసరాలు, ప్రజల సంక్షేమం కోసం ఒక విజన్‌తో పనిచేస్తున్న నాయకుడు చంద్రబాబే అన్నారు. కార్యక్రమంలో యుద్దం శ్రీనివాసులు, బి.సుబ్బరాయుడు, మురళి, బి.వెంకటేశ్వర్లు, హనుమన్న, మద్దిలేటి పాల్గొన్నారు.

ఓర్వకల్లు: రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమమే సీఎం చంద్రబాబు ధ్యేయమని ఎమ్మెల్యే గౌరు చరిత, టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. ఆదివారం మండలంలోని హుసేనాపురంలో మల్లెల రాజశేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చంద్రబాబు జన్మదిన వేడుకలకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే గౌరు చరిత హాజరయ్యారు. అనంతరం కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేస్తున్నారన్నారు. కార్యక్ర మంలో మాజీ సర్పంచ్ మల్లెల జ్యోతి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్ రెడ్డి, నాయకులు బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, మహబూబ్ బాషా, కేవీ మధు, జీకే సుధాకర్, శేఖరప్ప, బజారు, అన్వర్ బాషా, వెంకటరమణ, గొల్ల నాగరాజు, కాకి దేవేంద్ర, వేణు పాల్గొన్నారు.


ఉలిందకొండలో కేక్ కట్ చేస్తున్న ఈవీ రమణ

● మండలంలోని ఓర్వకల్లు, నన్నూరు, పూడిచెర్ల, కేతవరం, ఉయ్యాలవాడ, ఉప్పలపాడు, సోమయాజులపల్లె, కొమరోలు, చింతలపల్లె, పాలకొలను గ్రామాల్లో ఆదివారం సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఓర్వకల్లులో టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు స్వామిరెడ్డి, గౌస్, వేణుగోపాల్ రెడ్డి, అబ్దుల్లా, శ్రీరామిరెడ్డి, అల్లాబాబు పాల్గొన్నారు.

కర్నూలు, అర్బన్: ఎంపీ బస్తిపాటి నాగరాజు కార్యాలయంలో సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. అశోక్ నగర్ వద్ద ఉన్న మహిళా నిరాశ్రయుల గృహంలో నిత్యావసరాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కురువ కార్పొరేషన్ డైరెక్టర్‌గా రామకృష్ణ, వెంకటరాముడు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు,

కర్నూలు కల్చరల్: నగరంలోని వివిధ ఆలయాల్లో సీఎం చంద్రబాబు జన్మదినం సందర్భంగా ఆదివారం పూజలు నిర్వహిం చారు. నగరంలోని సంకల్‌బాగ్‌లోగల శ్రీదేవీ భూదేవీ సమేత వేంక టేశ్వర స్వామి దేవాలయం, భ్రమరాంబాదేవి సమితి రామలింగేశ్వర స్వామి ఆలయం (హరిహర క్షేత్రం)లో నగర బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్, ఏపీ అర్చక సమాఖ్య అధ్యక్షుడు టీవీ రవిచంద్ర శర్మ, బ్రాహ్మణ సంఘం గౌరవ సలహాదారు చెరువు వెంకట దుర్గాప్రసాద్, ఎస్ శ్రీనివాసరాజు, ప్రసాద్, ఆలయ అర్చకులు ప్రసన్న స్వామి, గురురాజ పాల్గొన్నారు.

● రాష్ట్ర ప్రజలకు బంగారు భవితను ఇచ్చేందుకు చంద్రబాబు నిరంతరం శ్రమిస్తున్నారని టీడీపీ నాయకుడు ఎం. లక్ష్మణగౌడ్ అన్నారు. ఆదివారం ఆలయ కమిటీ అధ్యక్షుడు, సీనియర్ టీడీపీ నాయకుడు కేఈ ప్రతాప్ ఆదేశాల మేరకు నగరంలోని అశోకన గర్‌లోగల ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలోని ద్వారా కామయి సాయిబాబా ఆలయం, శ్రీరామాలయం, శివాలయాల్లో చంద్రబాబు పేరుతో పూజలు చేశారు. పాత నగరంలోని శంకర మందిరంలోగల కామాక్షి సమేత చంద్రమౌళేశ్వర స్వామి ఆలయంలో, రాష్ట్ర టీడీపీ బ్రాహ్మణ సాధికార కమిటీ కన్వీనర్ బుచ్చి రాంప్రసాద్ ఆదేశాల మేరకు టీడీపీ నాయకుడు ఎన్ వెంకటరామ రాజు ఆధ్వర్యంలో చంద్రబాబు పేరుతో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు శ్రీధర్ శర్మ, రవిశర్మ, హేమంత్ శర్మ, దేవీప్రసాద్ పాల్గొన్నారు.

కోడుమూరు: పట్టణంలో ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదిన వేడుకలు టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. స్థానిక పాత బస్టాండ్‌లో టీడీపీ నాయకులు గోపాల్‌నాయుడు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అనంతరం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బడెసాగౌడ్, వేంపెంట రవి, మునిస్వామి, బ్రిటీష్‌రాముడు పాల్గొన్నారు.

గూడూరు: రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ జడ్పీటీసీ ఎల్ సుధాకర్ రెడ్డి అన్నారు. ఆదివారం గూడూరులో సీఎం నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను పురస్కరించుకొని కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్ర మంలో టీడీపీ నాయకులు చరణ్ కుమార్, చెట్టుకింది సురేష్, బాస్కర్ రెడ్డి, సంగాల మధు, చెట్టుకింది నారాయణ పాల్గొన్నారు.

● గూడూరు మండలం ఆర్ ఖానాపురంలో చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల తెలుగు యువత అధ్యక్షుడు సుమన్ బాబు, సర్పంచ్ మునిస్వామి, మన్యంకొండ, ఎల్లప్ప, చిన్న నరసింహులు, దస్తగిరి, సుభాన్, పెద్ద నరసింహులు పాల్గొన్నారు.


నంద్యాల చెక్‌పోస్టులో కేక్ కట్ చేస్తున్న గౌరు చరిత


ఓర్వకల్లులో కేక్ కట్ చేస్తున్న టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి


గూడూరులో..


హరిహర క్షేత్రంలో పూజలు చేస్తున్న నగర బ్రాహ్మణ సంఘం నాయకులు

రాజవర్ధన్ రెడ్డి సేవలు మరువలేనివి

● వర్ధంతిలో ఎమ్మెల్యేలు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు


మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి


గూడూరులో పేదలకు చీరలను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

కర్నూలు అర్బన్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): దివంగత కర్నూలు ఎంపీపీ డి.రాజవర్ధన్ రెడ్డి ప్రజలకు అందించిన సేవలు మరువ లేనివని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో రాజవర్ధన్‌రెడ్డి 3వ వర్ధంతిని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కా రెడ్డి, ఎమ్మెల్యేలు కేఈ శ్యామ్‌బాబు, బొగ్గుల దస్తగిరి, గౌరు చరితా రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎదు రూరు విష్ణువర్ధన్ రెడ్డి తనయుడిగా ప్రజలకు నిస్వార్థసేవలు అం దించిన ఆయన ఆకాల మృతి బాధ కలిగించిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై.నాగేశ్వరరావు యాదవ్, నాయ కులు కేవీ సుబ్బారెడ్డి, తుగ్గలి నాగేంద్ర, చిట్టా అరుణకుమారి, మల్లెల పుల్లారెడ్డి, హనుమంతరావు చౌదరి పాల్గొన్నారు.

గూడూరు: దివంగత మాజీ ఎంపీపీ రాజవర్ధన్ రెడ్డి ఆశయ సాధన కృషి చేద్దామని సీనియర్ టీడీపీ నాయకుడు, మాజీ వైస్ చైర్మన్ కె రామాంజనేయులు అన్నారు. ఆదివారం గూడూరులో రాజవర్ధన్‌రెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని కె రామాంజనేయులు ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం టీడీపీ కౌన్సిలర్ రేమట సురేష్ నిరుపేద మహిళలకు చీరలను పంపిణీ చేశారు. కార్యక్ర మంలో టీడీపీ నాయకులు రేమట వెంకటేష్, సృజన్, దానమయ్య, పౌలు, విజయ్ కుమార్, మన్సూర్ బాషా, నాగప్ప యాదవ్, కౌన్సిలర్ బుడ్డంగలి, ప్రభాకర్ నాయుడు, చాంద్ బాషా, తెలుగు శ్రీనివాసులు, రవి, మధు, వీర కుమార్ పాల్గొన్నారు.

సి.బెళగల్: స్థానిక ఎన్‌టీఆర్ పార్కులో మాజీ మండల కన్వీనర్ డాక్టర్ తిమ్మప్ప ఆధ్వర్యంలో ఆదివారం దివంగత మాజీ ఎంపీపీ రాజవర్ధన్ రెడ్డి తృతీయ వర్ధంతిని నిర్వహించారు. ఈసందర్భంగా మాజీ జడ్పీటీసీ చంద్రశేఖర్ మాట్లాడుతూ కర్నూలు మండల ఎంపీపీగా మంచి గుర్తింపు ఉన్న నాయకుడు రాజవర్ధన్‌రెడ్డి అని అన్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో రోగులకు పాలు పండ్లు బెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బాలజీ వెంకటేష్, భీమన్న, ధనుంజయుడు, ఈరన్నగౌడు, బీఎస్ వెంకటేశ్ పాల్గొన్నారు.

కోడుమూరు: విష్ణుసేన ఆధ్వర్యంలో రాజవర్ధన్‌రెడ్డి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక జడ్పీ బాలుర హైస్కూల్లో ఆదివా రం నిర్వహించిన కార్యక్రమానికి విష్ణు అభిమానులు పాల్గొన్నారు. రాజవర్ధన్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం విష్ణుసేన ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సుమారు 51 మంది రక్తదాన చేశారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణి చేయగా, స్నేహ వృద్ధాశ్రమంలోని అనాథలకు అన్నదానం చేశారు. కార్యక్ర మంలో టీడీపీ నాయకులు కేఈ మల్లికార్జునగౌడ్, గంగాధర్‌నాయుడు, గోపాల్‌నాయుడు, వేంపెంట రవి, మునిస్వామి, బడెసాగౌడ్, కల్లపరి మల్లికార్జున పాల్గొన్నారు.

ప్యాలకుర్తిలో పేదలకు చీరలు పంపిణీ: మండలంలోని ప్యాలకుర్తిలో టీడీపీ నాయకుడు చంద్రమౌళి ఆధ్వర్యంలో రాజవ ర్ధన్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్ర మంలో యూసూఫ్, షేక్షావలి, మాధవ్, సుంకన్న, మిన్నల్ల, బజారి పాల్గొన్నారు.

కోడుమూరు రూరల్: దివంగత మాజీ ఎంపీపీ రాజవర్ధన్‌రెడ్డి చిరస్మరణీయుడని టీడీపీ జిల్లా నాయకుడు పట్టె క్రిష్ణ అన్నారు. ఆదివారం రాజవర్ధన్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా లద్దగిరి గ్రామంలో పట్టె క్రిష్ణ అధ్వర్యంలో టీడీపీ కార్యకర్తలు నివాళి అర్పించారు. అలాగే అమడగుంట్లలో సర్పంచ్ వరలక్ష్మీ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో రమేష్, సురేష్, మధునాయుడు, శ్రీనివాసరెడ్డి, పట్టె మధు, శంకర్, కొండాపురం మధు పాల్గొన్నారు.

కర్నూలు కలెక్టరేట్: రాజావర్ధన్ రెడ్డి ఆశయాలను కొనసాగిద్దామని విష్ణు సేన సుగాలి సంఘం నాయకుడు యోగేష్ నాయక్ అన్నారు. ఆదివారం రాజావర్ధన్ రెడ్డి వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజావర్ధన్ రెడ్డి ఎంపీపీగా ఉన్న సమయంలో మండలంలోని అనేక గ్రామాల్లో ఎన్నో అభి వృద్ధి పనులు చేపట్టారని కొనియాడారు.


రాజవర్ధన్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న టీడీపీ నాయకులు

ఘనంగా ఈస్టర్


ప్రసంగిస్తున్న రెవ. ఆశీర్వాదం

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఈస్టర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పిల్లలపార్కు సమీపంలోని ఎస్‌పీజీ చర్చిలో జరిగిన పునరుత్థాన వేడుకల్లో పాస్టర్ అనిల్ కుమార్ సామ్యేల్ వాక్య సందేశం ఇచ్చారు. ఈస్టర్ ఆరాధనల్లో పాస్టర్ రెవ. వరప్రసాద రావు ఈస్టర్ ప్రాముఖ్యతను వివరించారు. కోట్ల సర్కిల్‌లోని కోల్స్ సెంటీనియల్ తెలుగు బాప్టిస్టు చర్చిలో జరి గిన సూర్యోదయ ఆరాధన కార్యక్రమంలో ఇండియన్ ఇవాంజెలికల్ మిషన్ రాష్ట్ర మహిళా కార్యదర్శి విక్టోరియా విజయ్ ఈస్టర్ సందేశం ఇచ్చారు. రెవ.అనిల్‌కుమార్ ఈస్టర్ ప్రాశస్త్యాన్ని తెలియజేశారు. చర్చి అధ్యక్షుడు అబ్రహాం లింకన్, కార్యదర్శి జాన్ విల్సన్, ఈస్టర్‌కమిటీ నిర్వాహకులు శ్యామ్‌సన్, పాల్, ప్రమోద్‌బాబు పాల్గొన్నారు. సి.క్యాంపులోని ప్రార్థన మందిరం చర్చిలో రెవ.డాక్టర్ ఐ.పి. ఆశీర్వా దం దైవ సందేశమిచ్చారు. రెవెన్యూ కాలనీలోని హోసన్న మందిరంలో బ్రదర్ ఫ్రెడీపాల్ ఈస్టర్ ప్రాముఖ్యతను తెలియజేశారు. యోరోషలేం మందిరంలో బ్రదర్ జి. డేవిడ్, హోరేబు టెంపుల్‌లో బ్రదర్ శ్యాంసన్, యెహోవా షమ్మా చర్చిలో ప్రధాన సంఘ కాపరి డాక్టర్ బి.స్టీఫెన్ చార్లెస్ క్రీస్తు పునరుత్థానం గురించి వివరించారు. ఆయా చర్చిలలో జరిగిన ఈస్టర్ ప్రార్థనలకు అధిక సంఖ్యలో క్రైస్తవులు హాజరయ్యారు.

కోడుమూరు రూరల్: మండలంలోని ప్యాలకుర్తి గ్రామంలో క్రైస్తవులు ఈస్టర్ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేకువజామున ఏసుక్రీస్తు పునరుత్థాన ఆరాధన ప్రార్థన చేశారు. అనంతరం గ్రామంలో సువార్త ర్యాలీ నిర్వహించారు. ఏసుక్రీస్తు సమాధిని గెలిచిన రోజుగా ఈస్టర్ సందేశం వినిపించారు. కార్యక్రమంలో పాస్టర్లు రెవ. భాస్కర్, రాజి పెద్దలు సొలమోన్, ఏసేపు, యేసురత్నం, తిమ్మన్న పెద్దమిన్నల్ల, రాజు పాల్గొన్నారు.

రైతుబజార్లలో రైతులకు చోటు

కలెక్టర్ ఆదేశాలతో కదిలిన యంత్రాంగం

కర్నూలు అగ్రికల్చర్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో రైతుబజార్లలో రైతులకు చోటే లేకుండా పోయింది. అక్కడ దళారులదే ఆధిపత్యం నడిచింది. వారిని అడ్డుకునేందుకు మార్కెటింగ్ శాఖ అధికారులు, రైతుబజార్ల ఎస్టేట్ అధికారులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో 'రైతుల్లేని రైతుబజార్లు' పేరుతో వచ్చిన కథనంతో కలెక్టర్ రంజిత్ బాషా స్పందించారు. ఆయన ఆదేశాలతో అధికార యంత్రాంగం కదిలింది. మార్కెటింగ్ శాఖ అధికారులు, తూనికలు, కొలతల శాఖ, సివిల్ సప్లయ్ అధికారులు దాదాపు 15 మంది జిల్లాలోని రైతుబజార్లలో జరుగుతున్న దళారుల దోపిడీని అడ్డుకునేందుకు తనిఖీలు చేపట్టారు. సి.క్యాంపు రైతుబజారులో దళారులను అడ్డుకునేందుకు చర్యలు తీసుకు న్నారు. రైతులు తప్ప దళారులకు ఎట్టి పరిస్థితుల్లోనూ చోటు కల్పించవద్దని ఎస్టేట్ అధికారి కళ్యాణమ్మ, హార్టికల్చర్ అధికారి శివకుమార్‌కు ఆదేశాలు జారీ చేశారు. దీంతో వారు త్రీటౌన్ పోలీస్ స్టేషన్ సీఐను ఆశ్రయించారు. పోలీసుల సమక్షంలో దళారులను బయటకు పంపించేశారు.

ఫీమేల్ హెల్త్ సూపర్‌వైజర్లకు పదోన్నతులు

కర్నూలు హాస్పటల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): వైద్యఆరోగ్యశాఖ కడప జోన్ పరిధిలో పని చేస్తున్న హెల్త్ సూపర్‌వైజర్లు (ఎంపీహెచ్-5 ఫీమేల్) 22 మందికి ఈనెల 22న పబ్లిక్ హెల్త్ నర్సు (పీహెచ్‌ఎన్ టీచింగ్)గా పదోన్నతి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు కడప రీజనల్ డైరెక్టర్ డా.రామగిడ్డయ్య ఆదేశాలు జారీ చేశారు. కడప ఆర్‌డీ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు కౌన్సెలింగ్ జరు గుతుందన్నారు. సర్వీసు రిజిస్టర్, పని సంతృప్తికరమైన సర్టిఫికెట్ తీసుకోవాలన్నారు. పదోన్నతులు పొందుతున్న వారిలో కర్నూలు ఉమ్మడి జిల్లాల నుంచి పి.లక్ష్మీకాంతమ్మ (పీహెచ్‌సీ దైవందిన్నె), ఏడీ ఇందిరా (పీపీ యూనిట్, ఆదోని), టి.శ్యామలదేవి, ఆర్.ప్రభా వతి (కౌతాళం పీహెచ్‌సీ), ఏ.లక్ష్మీదేవమ్మ (శిరివెళ్ల పీహెచ్‌సీ) ఉన్నారు.

'పుస్తక ముద్రణకు సహకారం'

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): విద్వాన్ 'షేక్ దావూద్' రాసిన 'దాసి పన్నా' చారిత్రక పుస్తకాలను భావి తరాలకు అందించాల్సిన అవసరం ఉందని, ఈ నాటక పుస్తక ముద్రణకు తమవంతు సహకారం అందిస్తామని క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం నగరంలోని మద్దూరునగర్‌లోని పింగళి సూరన తెలుగుతోట సమావేశ హాలులో, సాహితీ సదస్సు సంస్థ ఆధ్వర్యంలో 'ఆచార్య ఎన్వీ కృష్ణమూర్తి స్మారకోప న్యాసం, 'దాసిపన్నా' పుస్తకంపై అవలోకనం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కట్టా వెంకటేశ్వర్లు ఇతర సాహితీవేత్తలతో కలిసి ఆచార్య ఎన్వీ కృష్ణమూర్తి, షేక్ దావూద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సాహితీ సదస్సు సంస్థ అధ్యక్షుడు కేసీ కల్కూర తెలుగు భాషా వికాస ఉద్యమం సంస్థ రాష్ట్ర కార్యదర్శి జేఎస్‌ఆర్‌కే శర్మ ప్రసంగించారు. ఇటీవల కళారత్న పురస్కారం అందుకున్న పత్తి ఓబులయ్య, ఉగాది పురస్కారాలు అందుకున్న డాక్టర్ ఎం. హరికిషన్, ఎస్‌డీవీ అజీజ్‌లను సాహితీవేత్తలు సన్మానించారు. కార్యక్ర మంలో డీఎస్పీ మహబూబ్ బాషా, డాక్టర్ దండెబోయిన పార్వతీ దేవి, కా.వెం. సుబ్బలక్ష్మమ్మ, కర్నాటి చంద్రమౌళిని, హైమావతి, సీతామహాలక్ష్మి, పసుపులేటి నీలిమ, లక్ష్మి సుశీల, మజారు లక్ష్మయ్య పాల్గొన్నారు.

నైపుణ్యంతో ముందుకు సాగాలి: ఎమ్మెల్యే

కర్నూలు అర్బన్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి నైపుణ్యంతో ముందుకు సాగాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. ఆదివారం క్లస్టర్ యూనివర్సిటీ ఫర్ మెన్ డిగ్రీ కళాశాలలో తిహన్ ఫౌండేషన్ ఐఐటీ హైదరాబాద్ సహకారంతో ఐఐటీ డీఎం కర్నూలు ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమం జరిగింది. గౌరు చరిత మాట్లాడుతూ డ్రోన్ టెక్నాలజీపై అవగాహన కలిగి ఉండాలన్నారు. రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లు, కన్వీనర్ పద్మావతి, డీన్ అక్తర్ భాను పాల్గొన్నారు.

సురేంద్ర మృతి బాధాకరం

కర్నూలు, అర్బన్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): తెలుగు యువత జిల్లా అధికార ప్రతినిధి సురేంద్ర గుండెపోటుతో మృతి చెందడం బాధాకరమని ఎంపీ నాగరాజు అన్నారు. ఆలూరులో చంద్రబాబు జన్మదిన వేడుకలు జరుపుకుంటూ గుండె పోటుతో మరణించడం బాధకారమన్నారు.

దోబీ పోస్టులు రజకులకే కేటాయించాలి

ఆదోని టౌన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న దోబీ పోస్టులను రజకులకే కేటాయించాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కలిసి కోరినట్లు రాష్ట్ర రజక రాష్ట్ర కార్పొరేషన్ చైర్‌పర్సన్ సావిత్రి తెలిపారు. జిల్లా పర్యటనలో భాగంగా ఆదివారం కర్నూలు నగరానికి వచ్చిన మంత్రిని కలిసి రజకులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను వివరించారు. రజకుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం జరిగేలా చూస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు సావిత్రి తెలిపారు.

వక్ఫ్ సవరణ బిల్లుపై అవగాహన కల్పిస్తాం

ఆదోని టౌన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : ఎన్డీఏ ప్రభుత్వం పార్లమెంటులో మంజూరు చేసిన వక్ఫ్ సవరణ బిల్లు కారణంగా జరిగే కష్టనష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించేలా కరపత్రాల పంపిణీ చేపట్టినట్లు ముస్లిం జేఏసీ కన్వీనర్ నూర్ అహ్మద్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ, వక్ఫ్‌కు చెందిన స్థలాలు ప్రభుత్వ ఆధీనంలోకి వెళ్లిపోతే తిరిగి ఉంటుందని, ఈ బిల్లులకు వ్యతిరేకంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు ఫారుక్, మానవ హక్కుల సంఘం నాయకుడు ఖాదర్, ఎస్‌డీపీఐ నాయకుడు సద్దాం హుస్సేన్, మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి నాయకులు వసీం సాహెబ్, మహమ్మద్ పాల్గొన్నారు.

మెగా వైద్య శిబిరానికి స్పందన

ఆదోని టౌన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఆవోపా, వామ్ ఆధ్వర్యంలో ఎస్‌కేడీ కాలనీలోని సంస్కృతి ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి ప్రజలు భారీగా హాజరయ్యారు. కిమ్స్ (కర్నూలు), శాంతి రామ్ హాస్పిటల్ (నంద్యాల), ఆర్బిట్ డయాగ్నోస్టిక్స్(అపోలో ల్యాబ్స్), ఎన్టీఆర్ వైద్యసేవ (ఆరోగ్యశ్రీ) లకు సంబంధించిన గుండె, కిడ్నీ, ఎముకలు, కంటి ముక్కు విభాగాలకు చెందిన 13 మంది డాక్టర్లు 538 మందికి పరీక్షలను నిర్వహించారు. అందులో 96 మందికి కంటి శస్త్రచికిత్సలను చేయాలని నిర్ణయించారు. కార్యక్రమంలో ఆవోపా అధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్ గుప్తా, సౌజన్య కర్త కాకుబాళ్ నాగేష్, రఘు, యతగిరి వెంకటేశ్వర్లు, రత్నయ్య, ఈరన్న, మహిళీ విభాగం తరపున వంకదారు మమతా శ్రీ, శ్రీదేవి పాల్గొన్నారు.

కోటకొండలో వైద్యశాల నిర్మించాలి

దేవనకొండ, ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి): మండలంలోని పి.కోటకొండ గ్రామంలో ప్రాథమిక వైద్యశాల భవన నిర్మాణం చేపట్టాలని మండల బీజేపీ అధ్యక్షుడు కిరణ్‌కుమార్ రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ దృష్టికి తీసుకెళ్లారు. గ్రామానికి చెందిన ఓవ్యక్తి 50 సెంట్ల సొంత స్థలాన్ని ప్రాథమిక వైద్యశాల భవన నిర్మాణానికి దానం చేయనున్నట్లు చెప్పారు. అందులో నిర్మాణం చేపట్టాలని కర్నూలుకు వచ్చిన మంత్రిని కోరారు. అలాగే దేవనకొండ వైద్యశాలలో సిబ్బందిని పెంచి, అదనపు వడకలను ఏర్పాటు చేయాలని కోరారు. బీజేపీ మండల నాయకులు వీరయ్య తదితరులు ఉన్నారు.

ఆదోని ఎంఈవోకు డిప్యూటీ డీఈవోగా అదనపు బాధ్యతలు

ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : ఆదోని మండల విద్యాశాఖ (ఎంఈవో) అధికారి-1 రాజేంద్రప్రసాద్‌కు కర్నూలు ఉప విద్యాశాఖ అధికారిగా అదనపు బాధ్యతలు (ఎఫ్ఏసీ) అప్పగిస్తూ డీఈవో శామ్యూల్‌పాల్ అధికారికంగా ఆదేశాలు జారీచేశారు. ఈయన ఆదోని, ఆస్పరి మండలాలకు ఎంఈవోగా పనిచేస్తున్నారు. కర్నూలు డిప్యూటీ ఈవో పోస్టు ఖాళీగా ఉండడంతో రాజేంద్రప్రసాద్‌కు బాధ్యతలు అప్పచెప్పారు.

ఆర్థిక సాయం అందజేత

మద్దికెర, ఎప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): మద్దికెర గ్రామంలోని జెండా కట్ట వీధిలో నివసించే భవానిగురుస్వామి సిద్ద మృతిచెందాడు. స్థానిక సుబ్రహ్మణ్యం స్వామి దేవాలయ నిర్వాహకులు విజయ్‌ప్రసాద్ యాదవ్ మండల టీడీపీ అధ్యక్షుడు వారి కుటుంబానికి రూ. 5వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. అనంతరం భౌతిక కాయానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఉన్నారు.

టీడీపీ నాయకుడికి పరామర్శ

మద్దికెర, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): మండల తెలుగు యువత కార్యదర్శి మద్దికెర గ్రామానికి చెందిన టైలర్ హరి రెండు రోజుల కిందట ప్రమాదవశాత్తు కింద పడి కాలు విరిగిపోవడంతో మాజీ జెడ్పీటీసీ సభ్యులు పురుషోత్తం చౌదరి, రాజన్న యాదవ్, ఆదివారం పరామర్శించారు. వారు మాట్లాడుతూ కార్యకర్తలకు టీడీపీ అండగా ఉంటుందని అన్నారు. త్వరగా కోలుకోవాలని కోరారు. కార్యక్రమంలో తెలుగుయువత అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్, టీడీపీ నాయకులు క్రిష్టన్న, గూడురు కవిత, రామాంజులు, సతీష్‌కుమార్, ఎల్లప్ప, గడ్డం రామాంజులు ఉన్నారు.

ఉచిత కంటి ఆపరేషన్లకు 90 మంది ఎంపిక

పత్తికొండ టౌన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆదివారం నిర్వహించిన మెగా ఉచిత కంటి వైద్యశిబిరంలో 90 మంది కంటి పరీక్షలకు ఎంపికయ్యారు. స్థానిక సాయిబాబా దేవాలయ ప్రాంగణంలో కేడీసీసీ బ్యాంకుమాజీ వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ ఆధ్వర్యంలో విశ్వభారతి ఆసుపత్రి వైద్యులు ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. పత్తికొండ పట్టణవాసులే కాకుండా గ్రామీణ ప్రాంతవాసులు 150 మంది హాజరయ్యారు. ఇందులో కంటి పరీక్షలు నిర్వహించిన వారిలో 90 మందిని గుర్తించారు. వీరందరికీ ఉచిత కంటి ఆపరేషన్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కంటి వైద్యులు బండ్లయ్య, బాస్కర్, నిర్వాహకులు శ్రీకాంత్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ కొమ్ము నెట్టికల్లు, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ పునర్వికాసం సాధిద్దాం

పత్తికొండ టౌన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ పునర్వికాసం సాధిద్దామని గ్రంథాలయ పునర్వికాస వేదిక జిల్లా కన్వీనర్ కొత్తపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. ఆదివారం శాంతి టాలెంట్ హై స్కూల్‌లో డా.లక్ష్మణస్వామి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రజలు చెల్లించే ఆస్తి పన్నులు 8 శాతం గ్రంథాలయాలకు పన్ను కలిపి ఉంటుందన్నారు. ఆ నిధులను వివిద గ్రంథాలయాల్లో కొత్త పుస్తకాలు, ఫర్నీచర్, నూతన సాంకేతిక గ్రంథాలయ వనరులను సమకూర్చడానికి ప్రభుత్వం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సభ్యులు రామ్మోహన్ రెడ్డి, వెంకటేశ్వర్లు, చెన్నకేశవరావు, మారుతి పాల్గొన్నారు.

పేద విద్యార్థికి అండగా ఉంటాం



విద్యార్థిని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

ఆదోని, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : పేద విద్యార్థికి మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు తనయుడు భూపాల్ చౌదరి, తెలుగు యువత రాష్ట్ర నాయకులు మారుతి నాయుడులు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఇంటర్ వొకేషనల్ కోర్స్‌లో 958మార్కులు సాధించి స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించిన ఆదోని మండలం నాగనాథనహళ్లి గ్రామానికి చెందిన రాఘవేంద్రను మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు తనయుడు భూపాల్ చౌదరి, తెలుగు యువత రాష్ట్ర నాయకులు మారుతి నాయుడు, వెంకటేష్ చౌదరి ఘనంగా సన్మానించారు. విద్యార్థి ఉన్నత చదువుకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మారుతి నాయుడు,భూపాల్ చౌదరి మాట్లాడుతూ భవిష్యత్తులో ఇలాంటి పేద విద్యార్థులకు, పేదలకు మరిన్ని సేవలు అందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ చౌదరి, నాగనాథనహళ్లి గ్రామ టీడీపీ నాయకులు సుబ్బారెడ్డి, రామకృష్ణ, నరసప్ప, రాఘవేంద్రరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మంజునాథ్ గౌడ్, విద్యార్థి రాఘవేంద్ర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



పత్తికొండలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్యాంబాబు



ఆదోనిలో కేక్ కట్ చేస్తున్న నాయకులు



తుగ్గలిలో కేక్ కట్ చేస్తున్న తుగ్గలి నాగేంద్ర, టీడీపీ నాయకులు

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి: టీడీపీ నాయకులు

పత్తికొండ, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సీఎం చంద్రబాబు నాయుడు 75 జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే ఆలయాల్లో నాయకులు ప్రత్యేక పూజలు చేసి, అభిషేకాలు చేశారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

● పత్తికొండలో చంద్రబాబు నాయుడు 75వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా రెడ్డిబావి శివాలయంలో ఎమ్మెల్యే శ్యాంబాబు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పారిశుధ్య కార్మికులతో కలిసి గ్రామపంచాయతీ ఆవరణలో కేక్ కట్ చేశారు. పారిశుధ్య కార్మికులను శాలువాతో సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీని అన్ని విధాల అభివృద్ధి పథంలో నడిపిన ఘనత చంద్రబాబు నాయుడుదన్నారు. అభివృద్ధి అనే మంత్రంతో పనిచేసే చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పనిచేయడం గర్వంగా ఉందన్నారు. ఆయన అడుగుజాడల్లో నడుస్తూ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సాంబశివారెడ్డి, తుగ్గలి నాగేంద్ర, ప్రమోద్ కుమార్‌రెడ్డి, తిరుపాల్, రామానాయుడు, తిమ్మయ్య చౌదరి, చల్లారవి, కడవల సుధాకర్, విజయ్ మోహన్‌రెడ్డి, సర్పంచి కొమ్ముదీపిక, ఈవో నరసింహులు, కార్మికులు పాల్గొన్నారు.

● ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదినాన్ని పురస్కరించుకొని టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. 11 మంది బాధిత కుటుంబాలకు రూ.7లక్షల18వేల చెక్కులను ఆయన అందించారు.

ఆదోని: పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహం ఎదుట ఏపీ సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలను ఆదివారం టీడీపీ సీనియర్ నేత ఉమాపతి నాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు సీఎం చంద్రబాబు జన్మదినాన్ని పురస్కరించుకొని రాష్ట్ర కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, ఉమాపతి నాయుడు, భూపాల్ చౌదరి, మారుతి నాయుడు, వెంకట చౌదరిలు భారీ కేక్‌కట్ చేసి ఒకరినొకరు తినిపించుకున్నారు.

వెల్దుర్తి: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు 75వ జన్మదిన వేడుకలు వెల్దుర్తిలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం టీడీపీ పార్టీ కార్యాలయం నుండి పాతబస్టాండ్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. తెలుగుతల్లీ విగ్రహానికి, అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. టీడీపీ నాయకులు సుబ్బరాయుడు, కన్వీనర్ బలరాంగౌడు, తెలుగుయువత అధ్యక్షుడు సుధాకర్‌గౌడులు కేక్ కట్‌చేశారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రామకృష్ణాచారి, ఈదుల వెంకటరాముడు, లక్ష్మీరెడ్డి, తిరుమలేశుగౌడు తదితరులు పాల్గొన్నారు.

వెల్దుర్తిటౌన్: మాజీ ఎంపీపీ జ్ఞానేశ్వర్‌గౌడు స్వగృహం నందు నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్‌చేశారు. కార్యక్రమంలో సిద్దనగట్టు వెంకటేశ్వర్లు, రత్నపల్లె ఆనంద్, ఎస్సీ సెల్ మాజీ సభ్యులు వీరభద్రుడు, వడ్డె మల్లికార్జున, పూల రాముడు, నాయకంటి గిడ్డయ్య, నర్సాపురం రాముడు, రఘు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దేవనకొండ: ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడు 75వ పుట్టిన రోజు వేడుకలు మండలంలోని టీడీపీ నాయకులు ఘనంగా జరిపారు. స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద వాల్మీకి చైర్‌పర్సన్ కప్పట్రాళ్ల బుజ్జమ్మ, మండల టీడీపీ కన్వీనర్ విజయభాస్కర్‌గౌడ్, గ్రామ పంచాయతీ కార్యాలయంలో టీడీపీ మండల నాయకులు బడిగింజల రంగన్న, సుభాన్, వీరేష్‌లు కేకు కట్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మల్లికార్జునగౌడ్, రాజశేఖర్‌గౌడ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మద్దికెర: మండలంలోని మద్దికెర, పెరవలి గ్రామాలలో సీఎం చంద్రబాబా 75వ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా జరిపారు. ఆదివారం జిల్లా టీడీపీ కార్యదర్శి గుడురు ధనుంజయుడు, మాజీజెడ్పీటీసీ సభ్యులు పురుషోత్తం చౌదరి, రాజన్నయాదవ్, తెలుగు యువత అధ్యక్షుడు చంద్రశేఖర్ గౌడ్, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గడ్డం రామాంజులు, ఆధ్వర్యంలో చంద్రబాబు చిత్రపటానికి కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. కార్యక్రమలో టీడీపీ నాయకులు రామాంజులు, విఠోబా, శివప్రసాద్, సతీస్ కుమార్, కవిత, జానకి, శాంతిరెడ్డి, రాఘవేంద్ర, బీమరాజు, రంగన్న పాల్గొన్నారు.

20ఏడీఎన్9 : చిప్పగిరి లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పుట్టిన రోజు సందర్భంగా కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకుంటున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

చిప్పగిరి: ఆంధ్రప్రదేశ్‌ను నవ్యాంధ్రగా తీర్చిదిద్దాడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎనలేని కృషి చేస్తున్నారని టీడీపీ నాయకులు ఎన్ఆర్ఈజీఎస్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ఏరూరు మీనాక్షి నాయుడు, ఆలూరు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గుమ్మనూరు నారాయణ పేర్కొన్నారు. చంద్రబాబు నాయుడు పుట్టినరోజు సందర్భంగా ఆదివారం చిప్పగిరిలోని అంబేడ్కర్ కూడలిలో టీడీపీ మండల కన్వీనర్ లాయర్ పేక్షావలి ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి టీడీపీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో నాయకులు ఎల్లంకి రజిని, పోతురాజు రాముడు, గుంటూరు గోవిందు, సర్పంచ్ పురుషోత్తం, బటన్ హోల్ సురేష్, చిప్పగిరి జనార్దన్ స్వామి, బోగేష్, అమరేష్, నీటి సంఘం అధ్యక్షులు ధనుంజయ్య, మాజీ ఎంపీటీసీ సభ్యులు నరసింహులు, నగరడోన అంజి పాల్గొన్నారు.

ఆస్పరి: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు ఆదివారం మండలంలో ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్, పార్టీ ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్ వర్గీయులు వేరువేరుగా కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కృష్ణ యాదవ్, జీవన్ కుమార్, అటికల్ బాబు, సర్పంచ్ శివ కుమార్, ఎంపీటీసీ రహితుల్లా, రాఘవేంద్ర, సతీష్ కుమార్, యుగంధర్, మల్లికార్జున, ఈరన్న ఆచారి పాల్గొన్నారు.

తుగ్గలి: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం మండలంలోని తుగ్గలి, ఎర్రగుడి, చెన్నంపల్లి గ్రామాల్లో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ బత్తిన వెంకట్రాముడు, రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షుడు మనోహర్ చౌదరి, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు వెంకటపతి, మండల అధ్యక్షుడు తిరుపాల్ నాయుడు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి రోగులకు పండ్లు, బెడ్లు పంపిణీ చేసి బాణా సంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల ఉపాధ్యక్షుడు వెంకట్రాముడు చౌదరి, కృష్ణమూర్తి చౌదరి మధుబాబు, సత్యప్రకాష్, వల్లె వెంకటేశ్, మాబాషా, బలరాముడు, గిరిగిట్ల మల్లి తదితరులు ఉన్నారు.

క్రిష్ణగిరి: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయు డు జన్మదిన వేడుకలను తెలుగుదేశం నాయకులు ఘనంగా నిర్వహించారు. పత్తికొండ మార్కెట్‌యార్డ్ చైర్మన్ ఆలంకొండ నబి సాహెబ్,మండల టీడీపీ అధ్యక్షుడు కటారుకొండ మర్రి శ్రీరాములు,మండల తెలుగు యువత అధ్యక్షుడు బోయ బొంతిరాళ్ళ మహమ్మద్ రఫీ ఆదివారం కోయిలకొండ గ్రామంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీఈశ్వరయ్య, మాజీ సర్పంచ్‌లు గంగప్ప,కృష్ణయ్య,రంగడు,శీలప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆలూరు: సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు ఆదివారం ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరబద్ర గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వమించారు. అంజినేయ్య స్వామి విగ్రహం నఉంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. మాజీ మార్కెట్ యార్డ్ చైర్మెన్ గుమ్మ నూర్ నారాయణతో కలసి అంబేద్కర్, వాల్మీకి విగ్రహాలకు పూల మాల వేసి టీడీపీ కార్యాలయంలో కార్యకర్తల నడుమ కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. విగ్రహం వరకు ర్యాలీ చేపట్టారు. రాష్ట్ర రాజకీయం చరిత్రలో చంద్రబాబు గొప్ప నేతగా గుర్తింపు తెచ్చుకున్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ రామ్ నాథ్ యాదవ్, ఆలూరు బ్రాంచ్ కెనాల్ డీసీ చైర్మెన్ కిష్టప్ప మండల కన్వీనరులు అశోక్, తిప్పయ్య, సుధాకర్, పరమారెడ్డి, నాయకులు గిరి మల్లేష్ గౌడ్, అట్టేకల్ బాబు, తిమ్మయ్య, నరసప్ప, కొమ్ము రామాంజినేయులు, పాల్ రెడ్డి, ముద్దు రంగ, రాము, రమేష్, వన్నూరు వల్లి, మసాలా జగన్ పాల్గొన్నారు.

హొళగుంద: స్థానిక సిద్దేశ్వరస్వామి రైస్ మిల్లో టీడీపీ సీనియర్ నాయకుడు ఈడిగ గోవింద్ గౌడ్ ఆధ్వర్యంలో చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల కన్వీనర్ తిప్పయ్య కేక్ కట్ చేసి సంబరాలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ మాజీ మండల కన్వీనర్ వీరన్న గౌడ్, బుడగజంగాల రామాంజినేయులు, బీజే పొంపాపతి, ఎర్రిస్వామి, దిడ్డి వెంకటేష్ పాల్గొన్నారు.



ఆదోనిలో ర్యాలీ చేస్తున్న నాయకులు



చిప్పగిరిలో కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు



ఆస్పరిలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు



దేవనకొండలో...



వెల్దుర్తిలో...



ఆలూరులో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నారాయణ



క్రిష్ణగిరిలో కేక్ కట్ చేస్తున్న నాయకులు



మద్దికెరలో...



హొళగుందలో..



ఆలూరులో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

మరణాన్ని జయించి తిరిగి లేచిన ఏసుక్రీస్తు

● ఘనంగా ఈస్టర్ వేడుకలు

ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : ఏసుక్రీస్తు మరణాన్ని జయించి పునరుత్థానుడై తిరిగి లేచారని సీఎస్ఐ క్రైస్ట్ చర్చి పాస్టర్ రెవరెండ్ విలియం సుజిత్ అన్నారు. ఆదివారం ఆదోని పట్టణంలోని క్రైస్తవ మందిరాల్లో ఈస్టర్ పండుగ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఎస్‌కేడీ కాలనీ హోలీట్రినిటి చర్చిలో ఆ సంఘ పాస్టర్ రెవరెండ్ భరత్ ఆధ్వర్యంలో, సీయోను ప్రార్థన మందిరంలో దైవ సేవకుడు సహోదరుగు ఆకేపోగు తిమోతి, మండిగిరి కాతోలిక చర్చిలో రెవరెండ్ ఫాదర్ కోలా విజయరాజు, రాయనగర్ ఎంబీ చర్చిలో ఎమ్మెస్ రావు ఆధ్వర్యంలో పునరుత్థాన దినోత్సవ వేడుకల సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ప్రభువైన యేసుక్రీస్తు ఈ లోకానికి మానవ రూపంలో జన్మించి సర్వలోక మానవాళి పాప పరిహారార్థం సిలువ ఎక్కి తిరిగి మూడవరోజు లేచారన్నారు. ఆయన చూపిన కరుణ దయ, ప్రేమను ప్రతి ఒక్కరు కలిగి ఉండాలని సూచించారు.

ఆలూరు: ఆలూరు మండలంలోని అన్ని చర్చిలలో ఈస్టర్ పండుగను ఆదివారం క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం ఈస్టర్ పండుగ సందేశంను మొలగవల్లి కొట్టాల సీఎస్ఐ చర్చిలో పాస్టర్ పుస్తెల కుమార్ అందించారు. ఏసు క్రీస్తు మరణాన్ని జయించి మూడవ రోజు సజీవుడై తిరిగి లేచిన రోజును ఈస్టర్ పండుగగా జరుపుకుంటున్నారు. అలాగే ఆలూరు సీఎస్ఐ, ఆర్‌సీఎం చర్చిలల్లో కూడా ఈ వేడుకలు జరిగాయి.



ఆదోని విక్టోరియా పేట చర్చిలో క్రైస్తవ గీతాలను పాడుతున్న చిన్నారులు



ఆలూరు మండలం ఎం.కొట్టల సీఎస్ఐ చర్చిలో దైవ సందేశం ఇస్తున్న పాస్టర్ పుస్తెలకుమార్

ఎమ్మెల్యే నోరు అదుపులో పెట్టుకో

ఆలూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి అడ్డూ అదుపు లేకుండా కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేస్తే సహించేది లేదని ఆలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ గుమ్మనూరు నారాయణ హెచ్చరించారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడుతూ టీడీపీ క్రమశిక్షణ గల పార్టీ అని వైసీపీ మాదిరిగా ఏది పడితే అది మాట్లాడటం మా పార్టీ నైజం కాదన్నారు. అలా మాట్లాడే ఎన్నికలో ప్రజలు 11 స్థానాలు ఇచ్చి ప్రతిపక్ష హోదా లేకుండా పోయిందన్నారు. మా పార్టీ అధినేతపై ఇక మీదట విమర్శలు చేస్తే నీ చరిత్ర ఏమిటో బయటపెడుతామని హెచ్చరించారు.

వక్ఫ్ సవరణ బిల్లును రద్దు చేయాలి

పత్తికొండ టౌన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన వక్ఫ్‌బోర్డు సవరణ చట్టం బిల్లును తక్షణమే రద్దు చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ముస్లీం మత పెద్దలను కలుసుకుని సీపీఐ ఆధ్వర్యంలో ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేస్తూ వక్ఫ్‌బోర్డు సవరణ చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనార్టీల హక్కులకు భంగం కలిగించే వక్ఫ్ సవరణ చట్టం రద్దు చేయాలని సీపీఐ ఆధ్వర్యంలో సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు గుండుబాషా, ఆల్తాఫ్ పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

● ఇండియన్ రెవెన్యూ సర్వీసెస్ అసిస్టెంట్ కమిషనర్ సురేష కుమార్ శర్మ



మాట్లాడుతున్న సురేష్ కుమార్

పత్తికొండ టౌన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఇష్టంతో చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకున్నప్పుడే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని హైదరాబాదు ఇండియన్ రెవెన్యూ సర్వీసెస్ అసిస్టెంట్ కమిషనర్ సురేష్ కుమార్‌శర్మ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని పాతపేటలో యువ స్పందన సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టడీ సర్కిల్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి స్టడీ సర్కిల్‌ను ప్రారంభించి, అనంతరం స్టడీ హాల్స్‌ను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో వేలకు వేలు ఖర్చు పెట్టి దూర ప్రాంతాల్లో చదువుకునేందుకు నిరుద్యోగులు వెళ్ల చాలా ఇబ్బందులు కష్టాలు పడుతున్నారని అన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే నిరుద్యోగుల కోసం పత్తికొండ యువ స్పందన సొసైటీ చేస్తున్నమంచి కార్యక్రమాలు ఎంతో అభినందనీయమన్నారు. స్టడీ సర్కిల్‌ను సద్వినియోగం చేసుకుని పోటీ పరీక్షల్లో రాణించి ప్రభుత్వ ఉద్యోగాలు సాదించాలని నిరుద్యోగ యువతను సూచించారు. కార్యక్రమానికి అతిథులుగా వచ్చిన వారికి శాలువా, జ్ఞాపికలు అందజేసి సొసైటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ రిటైర్డు ఆఫీసర్ సింగారి శివయ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.రామారావు, ఎంఈవో రమేష్, అధ్యాపకుడు వీరేశప్ప, ఎస్‌బీఐ మేనేజర్ జానకీ రామయ్య, యువ స్పందన సొసైటీ అధ్యక్ష ఉపాధ్యక్షులు సురేంద్ర, లక్ష్మన్న, సెక్రటరీ నాగరాజు, సహాయ కార్యదర్శి గిరీష్ పాల్గొన్నారు.

మంత్రాలయంలో భక్తుల కోలాహలం


భక్తులతో కిటకిటలాడుతున్న మఠం ప్రాంగణం

మంత్రాలయం, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో కోలాహలంగా మారింది. ఆదివారం సెలవు దినం కావటంతో దక్షణాది రాష్ట్రాలనుంచి వే లాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగాణం భక్తులతో కిక్కిరిసింది. వేలాది మంది భక్తులు రావడంతో మఠం అతిథిగృహాలు, ప్రైవేట్ లాడ్జిలు భక్తులతో నిండిపోయాయి. అద్దె రూములు దొరక్క మధ్వమార్గ్ కారిడార్ ముందే భక్తులు బసచేశారు. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖద్వారం, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, నదితీరం భక్తులతో కోలాహలంగా మారింది. గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. క్యూలైన్స్లు, పరిమళ ప్రసాదం వద్ద భక్తుల సందడిగా మారింది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని శ్రీమఠం అధికారులు ఏఏఓ మాధవశెట్టి, మేనేజరు వెంకటేష్ జోషి ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. సొంత వాహనాల్లో వచ్చిన భక్తులు ప్రధాన రహదారిపై ఇరువైపులా పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ సమస్యతో భక్తులు, గ్రామస్తులు ఇబ్బందులు పడ్డారు.

రాఘవేంద్రస్వామి మఠానికి భక్తుల విరాళాలు

మంత్రాలయం, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి మఠానికి బెంగళూరుకు చెందిన గౌత వరదరాజు అనే భక్తుడు రూ.లక్ష అన్నదానంకు, గోవిందన్ అనే మరోక భక్తుడు రూ.లక్ష దైనందిక సేవకు విరాళంగా ఇచ్చినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజరు వెంకటేష్ జోషి, సురేష్ కోణాపూర్ తెలిపారు. ఆదివారం వారు వేర్వేరుగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని రూ.2 లక్షల నగదును విరాళమి చ్చారు. దాతల కుటుంబాలకు పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు రాఘవేంద్రస్వామి జ్ఞాపిక, శేషవస్త్రం ఇచ్చి ఆశీర్వదించారు. సూపరింటెండెంట్ అనంతపురాణిక్, గిరిధర్, నరసింహ దేశాయ్, శ్రీపాదాచార్ పాల్గొన్నారు.

జంధ్యం తొలగించడం అపచారం

మంత్రాలయం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు


మాట్లాడుతున్న పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

మంత్రాలయం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో వృత్తి విద్యకోర్సులో ప్రవేశానికి నిర్వహించిన సీఈటీ పరీక్షలు రాసేందుకు వెళ్లిన విద్యార్థి జంధ్యం తొలగించి పరీక్షలు రాయించడంపై మంత్రాలయం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఖండించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కర్నాటకలోని శివమొగ్గ, బీదర్ జిల్లాలో జంధ్యాన్ని తొలగించడం హిందూ ధర్మానికి అపచారమన్నారు. దేశంలో ఏ మతస్థులైనా వారి సంప్రదాయాలు పాటించే స్వేచ్ఛ ఉందని, ధర్మానికి విరుద్ధంగా జంధ్యం తొలగించడం అపహాస్యమన్నారు. భారతదేశ హిందూ సంస్కృతి సంప్రదాయాలను ఇలాంటివి అపచారాలు జరగకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, మంత్రులు, ఎమ్మెల్యేలు జాగ్రత్త వహించాలన్నారు. ఇలాంటి సంప్రదాయాలకు విరుద్ధంగా చేపట్టిన సిబ్బందిని సస్పెండ్ చేసి విద్యార్థులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

నేడు సర్వసభ్య సమావేశం

గోనెగండ్ల, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మణిమంజరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశం మండల అధ్యక్షుడు నసూరుద్దీన్ అధ్యక్షతన నిర్వహిస్తున్నామని, మండలంలోని అన్ని శాఖల అధికారులు ఎంపీటీసీలు, సర్పంచ్లు హాజరుకావాలని పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లోని సమస్యలను అధికారులు దృష్టికి తీసుకురావాలని కోరారు.

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు


కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఫైర్ ఆఫీసర్ రామాంజనేయులు

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ఈనెల 14నుంచి నిర్వహిస్తున్న అగ్నిమాపక వారోత్సవాలు ఆదివారం ముగిశాయి. చివరి రోజు అగ్నిమాపక కేంద్రం దగ్గర అగ్నిప్రమాదాలపై స్థానికులకు అవగాహన కల్పించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫైర్ ఆఫీసర్ రామాంజనేయులు మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పట్టణంలో ఈనెల 14నుంచి 20వ తేదీ వరకు పలు కార్యక్రమాలు నిర్వహించి అగ్నిప్రమాదాల నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించామన్నారు.

జీవాల మూగ రోదన


మండుటెండలో తాగునీటి కోసం మూగజీవాల అవస్థలు

గోనెగండ్ల, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ఎండ తీవ్రత రోజురోజుకు పెరుగుతుంది. పంట పొలాల్లోని బావులు, బోర్ల దగ్గర నీరు లేకపోవడంతో మూగజీవాలకు తాగు నీటి సమస్య తీవ్రమైంది. పొలాల దగ్గర నీరు లేదు. దీంతో మూగజీవాల రోదన అరణ్యరోదనగానే మిగిలిపోతుంది. మండలంలోని పలు గ్రామాల్లో మేకలు, గొర్రెలు, పొట్టేళ్ల పంట పొలాల్లో తాగునీరు లేక తీవ్రఇబ్బందులు పడుతున్నాయి. మేతకు వెళ్లిన మూగజీవాలు నీరు లేక మండుటెండల్లో తల్లడిల్లినట్టు కాపరులు తెలుపుతున్నారు. తాగునీరు అందక రెండు జీవాలు మరణించినట్లు కాపరులు తెలిపారు. పొలాల్లో పక్షులు సైతం నీరులేక మృతి చెందుతున్నాయి.

రాష్ట్రాభివృద్ధే చంద్రబాబు ధ్యేయం

● ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి
● టీడీపీ కార్యాలయం నుంచి సోమప్ప సర్కిల్ వరకు బైక్ ర్యాలీ
● ఘనంగా సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధే సీఎం చంద్రబాబు నాయుడు ధ్యేయమని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. ఆదివారం ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదిన వేడుకలను ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా పార్టీ కార్యాలయం నుంచి ఎమ్మెల్యే బీవీ, టీడీపీ నాయకులు సోమప్ప సర్కిల్ వరకు భారీ ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. సోమప్ప సర్కిల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 75 కేజీల కేక్ను ఎమ్మెల్యే బీవీ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు విషయంలో వయసు అనేది నంబర్ మాత్రమేనన్నారు. యుగపురుషుడు ఎన్టీఆర్ అయితే చంద్రబాబు నాయుడు తెలుగు ప్రజలు వేడిని వాడిని, మేదస్సును ప్రపంచపటంలో పెట్టిన మహానుభావుడన్నారు. ఆయన వందేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. సీఎంకు ఎమ్మిగనూరు పార్టీ శ్రేణుల తరుపున జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, బ్రేడ్లు, పండ్లు అందజేశారు. నాయకులు కొండయ్య చౌదరి, మిఠాయి నరసింహులు, రామదాసు గౌడ్,మహేంద్ర బాబు, గుంటుపల్లి భాస్కర్ చౌదరి, కడిమెట్ల చెన్నారెడ్డి, యుకే వీరేంద్ర, అల్తాఫ్, కాశీం వలి, ధర్మపురం గోపాల్, చిన్నరాముడు, మహేష్, నారాయణరెడ్డి, మాచాని శివశంకర్, తురేగల్ నజీర్, నంబూరి సురేష్చౌదరి, నవాజ్, ఫారుక్, సురేష్, మాచాని శివకుమార్, రంగస్వామి గౌడ్, రామకృష్ణనాయుడు, సూర్యనారాయణ రెడ్డి, అంజి, కటారి రాజేంద్ర పాల్గొన్నారు.

కమ్మసంఘం ఆధ్వర్యంలో... పట్టణంలోని అమరావతి రెసిడెన్సిలో ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదిన వేడుకలను కమ్మసంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ను కట్ చేసి మిఠాయిలు పంచి సంబరాలు చేసుకున్నారు. టీడీపీ నాయకులు బాస్కర్ల చంద్ర శేఖర్ చౌదరి, కమ్మసంఘం గౌరవాధ్యక్షులు మహేంద్రబాబు, అధ్యక్షులు గుంటుపల్లి భాస్కర్ చౌదరి, ఉపాధ్యక్షుడు నరసింహరావు, తమ్మినేని రవిశంకర్, ట్రెజరర్ కాకర్ల వీరేష్ చౌదరి, సభ్యులు నంభూరి సూరేష్ చౌదరి, జగదీష్, సురేష్, ఉపేంద్ర, గురుప్రసాద్, లోకేష్, రాఘవేంద్ర, వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, హనుమంతు పాల్గొన్నారు.

మంత్రాలయం: రాష్ట్రాభివృద్ధి సీఎం చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని మంత్రాలయం టీడీపీ నియోజకవర్గ ఇన్చార్జి ఎన్ రాఘవేంద్రరెడ్డి అన్నారు. ఆదివారం మాధవరంలోని తననివాసంలో చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేశారు. బాణాసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రంలో టీడీపీ సీనియర్ నాయకులు రఘునాథరెడ్డి, రాకేష్రెడ్డి, తెలుగు రైతు జిల్లాప్రతినిధి, దూదేకుల సంఘం రాష్ట్ర గౌరవ సలహాదారులు సాయిబాబు, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి చావిడి వెంకటేష్, మాజీ జడ్పీటీసీ ఆర్ లక్ష్మయ్య, చంద్ర, ఎస్ఎం గోపాల్ రెడ్డి, పవన్కుమార్, గోపాల్, వరదరాజు, నాగేష్ నాయుడు, లింగప్ప, రాజన్న, ఏసన్న, రామకృష్ణ, ఉరుకుందు, బొజ్జప్ప, చాకలి రాఘవేంద్ర, విజయ్కుమార్, నరసింహులు పాల్గొన్నారు.

విజన్ ఉన్న నాయకుడు : రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు విజన్ ఉన్న ఏకైక నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాత్రమేనని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంత్రాలయం టీడీపీ కార్యాలయంలో మండల కన్వీనర్ పన్నగ వెంకటేష్, బీసీసెల్ నియోజకవర్గ అధ్యక్షులు అమర్నాథ్రెడ్డి ఆధ్వర్యంలో చంద్రబాబు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేకును కట్చేసి, భారీఎత్తున బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్చార్జీ యల్లారెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, విజయరామిరెడ్డి, అండే హనుమంతు, చిన్నభీమా, యేబు, నరసింహులు, నవకోటి నారాయణ, లక్ష్మన్న, సుజ్ఞానం, ధర్మరాజు, నర్సిరెడ్డి, కేశన్న, తిక్కస్వామి గౌడు, మన్మథరెడ్డి పాల్గొన్నారు.

గోనెగండ్ల: మండల కేంద్రమైన గోనెగండ్లలో ఆదివారం సీఎం చంద్రబాబు నాయుడి 75వ జన్మదిన వేడుకలను మండల టీ డీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. టీడీపీ కార్యాలయ ఆవరణంలో కార్యకర్తలు కేక్ కట్చేసి శుబాకాక్షలు తెలుపుకున్నారు. మిఠాయిలు పంచుకున్నారు. నాయకులు బేతాళబడేసా, తిరుపత్యానాయుడు, తిమ్మారెడ్డి, రంగముని, అడ్వకేట్ చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, కాంట్రాక్టర్ షేక్షావలి, రాజేష్, హరికృష్ణ, రమణ, భారతం రహంతుల్లా, మిన్నల్ల, ఫకృద్దీన్, రఫీక్, ఐరన్ బండ బాషా, నూర, మదీనా పాల్గొన్నారు.

పెద్దకడుబూరు: మండల కేంద్రమైన పెద్దకడుబూరుతో పాటు ఆయా గ్రామాల్లో టీడీపీ నాయకులు ఆదివారంముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 75వ జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం 8గంటలకే మండల కేంద్రమైన పెద్దకడుబూరులో టీడీపీ రాష్ట్ర రైతు సంఘం అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి, తెలుగు మహిళా నాయకురాలు నరవ శశిరేఖ ఆధ్వర్యంలో కేక్కట్ చేసి, మిఠాయిలు పంచుకొని సంబరాలు జరుపుకున్నారు. మల్లికార్జున, మీసేవా ఆంజనేయులు, వీరేష్గౌడు, ఎంజీ నరసన్న, లక్ష్మన్న, నరసింహారెడ్డి, ఈరన్న పాల్గొన్నారు.

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో సీఎం నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను రెండు వర్గాలుగా విడిపోయి పోటాపోటీగా నిర్వహించారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నబసప్ప ఆధ్వర్యంలో పార్టీ మండల నాయకులతో కలసి ఘనంగా జరుపుకున్నారు. పార్టీ కార్యాలయం వద్ద మండల అధ్యక్షుడు ఉలిగయ్య ఆధ్వర్యంలో జన్మదిన నిర్వహించారు. నాయకులు బాపురం శివమోహన్ రెడ్డి, కోట్రేష్గౌడ్ కురుగోడు, దొడ్డనగౌడ్, కుంబళనూరు సర్పంచ్ వీరేష్, ఈరన్న గౌడ్,కౌతాళం టౌన్ టీడీపీ అధ్యక్షుడు కాశీవిశ్వనాథ్, మంజునాథ, మైనార్టీ నాయకులు రహిమాన్, రఫీక్, ఉరుకుంద నరసింహులు, శివప్పగౌడ్ ఉన్నారు.

కోసిగి: మండల కేంద్రమైన కోసిగిలో టీడీపీ నాయకులు వేర్వేరుగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంత్రాలయం టీడీపీ ఇన్చార్జి రాఘవేంద్రరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి రెండు వర్గాల నాయకులు, కార్యకర్తలు వేడుకలు జరుపుకున్నారు. రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ముత్తురెడ్డి, పల్లెపాడు రామిరెడ్డి ప్రత్యేక పూజలు చేసి ఆలయం ముందు కేక్ కట్ చేశారు. తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి పాలకుర్తి దివాకర్రెడ్డి, పెండ్యాల భరద్వాజశెట్టి ఆధ్వర్యంలో భారీ కేక్ కట్చేసీ సీఎం చంద్రబాబు పుట్టినరోజు ఘనంగా నిర్వహించారు. పేదలకు అన్నదానం నిర్వహించారు. టీడీపీ నాయకులు జ్ఞానేష్, నాడిగేని అయ్యన్న, కోసిగి, ఆలూరు మాజీ జడ్పీటీసీలు రామకృష్ణ, రాంభీమ్ నాయుడు, నాడిగేని చిన్నతాయన్న, గౌస్, మదిరి వీరారెడ్డి, వీరయ్య, ఉప్పలపాటి అర్జున్, గుండేష్, రంగారెడ్డి, సొట్టయ్య, నాడిగేని మహాదేవ, ఈరెడ్డి, ఉలిగయ్య, సోల్మాన్ రాజు, గాంధీనగర్ శ్రీను, కృష్ణారెడ్డి, రామయ్య, హనుమంతు, మారేష్ ఉన్నారు.


పెద్దకడుబూరులో..



కోసిగిలో..


ఎమ్మిగనూరులో భారీ కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి


కమ్మసంఘం ఆధ్వర్యంలో..



మంత్రాలయంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస రెడ్డికి కేకును తినిపిస్తున్న టీడీపీ నాయకులు


గోనెగండ్లలో..


కౌతాళంలో...

భక్తిశ్రద్ధలతో ఈస్టర్

చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

మంత్రాలయం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం, మాధవరం, రచ్చుమర్రి, మాలపల్లి, రాంపురం, చెట్నహళ్లి, సూగూరు, వగరూరు, తిమ్మాపురం, తుంగభద్ర గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో ఈస్టర్ జరుపుకున్నారు. సీఎస్ఐ డివిజనల్ చైర్మన్ రెవ. వేదనాయకం, జాన్వెస్లీ, ఎస్డీ రాజన్న, యేసయ్య, రెవ.సేతు ఆధ్వర్యంలో చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తెల్లవారుజామున ఆధ్యాత్మిక క్రైస్తవ భక్తి పాటలతో గ్రామ పురవీధుల గుండా ఊరేగింపుతో యేసుక్రీస్తు సమాధి నుంచి లేశారని సువార్త ప్రకటించారు. దావీదు తనయా యేసన్న.... యూదుల రాజా హోసన్నా.... అంటూ జయధ్వనులు పలుకుతూ సంబ రాలు చేసుకున్నారు. అనంతరం చర్చిల్లో ఈస్టర్ ప్రత్యేకతను పాస్టర్లు వాక్య సందేశాన్ని చేశారు. కార్యక్రమంలో సంఘ నిర్వాహకులు భూపతి, తిమోతి, వినోద్, జగదీష్, పాలరాజు, మేకల తిమోతి, యోబు, ప్రభుదాసు, కుమార్, దేవదాసు, మరియప్ప, నరసింహులు, దానియేలు, రాజు పాల్గొన్నారు.



మాధవరంలో సందేశం ఇస్తున్న రెవ పాస్టర్ జాన్వెస్లీ, హాజరైన క్రైస్తవులు


కోసిగిలో సందేశం ఇస్తున్న పాస్టర్

కోసిగి: మండల కేంద్రమైన కోసిగితో పాటు చింతకుంట, పల్లెపాడు, డి.బెళగల్, ఐరంగల్, సాతనూరు, కందుకూరు, కామనదొడ్డి, జుమాల దిన్నె, వందగల్లు గ్రామాల్లో ఆదివారం క్రైస్తవులు ఈస్టర్ పండుగను ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచే చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సీఎస్ఐ, రోమన్ క్యాథలిక్ , క్రీస్తు సంఘం, ఏసుకృపా ప్రార్థన మందిరం వంటి చర్చిలలో ఫాస్టర్లు రాజారత్నం, ప్రేమ్ కుమార్, దేవపుత్ర, ఫాదర్ జాకోబు, చిదానంద, థోని, శ్రీను, శాంతమూర్తి ఆయా చర్చిలలో యేసు సందేశమిచ్చారు.

ఎండినది

● హంద్రీలో అడుగంటుతున్న భూగర్భజలాలు
● అక్రమంగా ఇసుక తరలింపు
● పరివాహక గ్రామాల్లో తాగునీటి సమస్య

గోనెగండ్ల, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): రోజురోజుకు ఎండ వేడిమి పెరగడంతో హంద్రీ నదిలోని నీరు ఆవిరై పోతుంది. దీంతో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. హంద్రీ పరివాహక గ్రామాల్లోని బోర్లు బావుల్లో నీరు ఇంకిపోవడంతో తాగునీటి కష్టాలు మొదల య్యాయి. హంద్రీ నదిలో వేసిన బోర్లు నీరు అడుగంటిన కారణంగా నీరు పట్టిపట్టి వస్తున్నాయని గ్రామస్థులు పేర్కొంటున్నారు. దీనికి తోడు వేముగోడు, తిప్పనూరు, గంజహళ్లి గ్రామ సమీపంలోని హంద్రీ నదిలోని ఇసుకను కొందరు అక్రమంగా రోజుకు 20 నుంచి 30 ట్రాక్టర్లతో తరలిస్తుండటంతో భూగర్భజలాలు అడుగంటి పోతున్నాయి. ఇదీ కాక ఇసుకను తరలిస్తుండటంతో ప్రస్తుతం బోర్లకు వస్తున్న నీరు కూడా ఉప్పగా మరిపోతుందన్ని వేముగోడు గ్రామస్థులు తెలుపుతు న్నారు. హెచ్ కైరవాడి, పుట్టపాశం, వేముగోడు, తిప్పనూరు, లింగం దిన్నె, ఎర్రబాడు, వీరంపల్లి తదితర గ్రామాల్లో బోర్లకు మరో పది లేక పదిహేను రోజుల్లో నీరు అందకపోవచ్చని గ్రామస్థులు తెలుపుతున్నారు.


వేముగోడు దగ్గర ఎండుతున్న హంద్రీ నది

పంట అవశేషాల కాల్చివేతతో నష్టం

● పర్యావరణం, మానవ ఆరోగ్యంపై ప్రభావం
● భూసారం తగ్గే ప్రమాదం

గోనెగండ్ల, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): పంట అవశేషాలు కాల్చడంతో గాలి కాలుష్యం అవుతోంది. ప్రస్తుతం పంటలు సాగు పూర్తి అయింది. ఇక రైతులుపంట అవశేషాలు కాల్చడంతో కలిగేనష్టాలను గుర్తించడం లేదని వ్యవసాయశాఖ అధికారులు అంటున్నారు. పంట సాగు పూర్తయిన తరువాత పంట అవశేషాలను కాల్చడం అనేది ప్రధా న సమస్యగా మారింది. ఈ పద్ధతి పర్యావరణ, ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని వ్యవసాయశాఖ అధికారులు తెలుపుతున్నారు. ఈ పద్ధతితో ప్రజలకు తీరని ఇబ్బందిగా మారుతుంది. వాయు కాలుష్యం గణనీయంగా పెరుగుతుందని అధికారులు చెబుతున్నా రు.

వాయుకాలుష్యం..

పంట అవశేషాలు కాల్చడంతో గాలిలో కాలుష్య కణాలు విడుదల అవుతాయి. ఇవి గాలి నాణ్యతను తగ్గిస్తాయి. శ్వాసకోశ వ్యాధులకు కారణం అవుతాయి. ఈ పద్ధతిని రైతులు మానుకోవాలి. ఆదోని డివిజన్లో పంటల అవశేషాలను కాల్చడం పరిపాటిగా మారిపోయింది.

భూసార క్షీణత..

అవశేషాలను కాల్చడంతో పోషకాలు నష్టపోతాయి. భసారం తగ్గిపోతుంది. గాలి కాలుష్య కణాలు ప్రజల ఆరోగ్యానికి హానికరమైనవి. శ్వాసకోశ, చర్మ వాధ్యలు, ఇతర ఆరోగ్య సమస్యలు కూడా వస్తాయి.

వాతావరణ మార్పులు..

పంట అవశేషాలను కాల్చడంతో గ్రీన్ హౌస్ వాయువులు విడుదల అవుతాయి. ఇవి వాతావరణ మార్పులకు దోహదపడతాయి.

పంటల అవశేషాలను ఎలా వాడుకోవాలి:

పంటల అవశేషాలను కాల్చడానికి బదులు ఇతర పద్ధతులను అవలంబించడం ద్వారా మనం ఈ సమస్యను పరిష్కరించుకోవచ్చును. ఇది నేల సారాన్ని పెంచడంతో పాటు వాతరణ కాలుష్యం తగ్గిస్తుంది. పంట అవశేషాలు కుళ్లించి వీటిని నేలలో కలపడం ద్వార నేల సారవంత అవుతుంది. నేలలో దున్నడం ద్వారా అవి వేగంగా భూమిలో కుళ్లిపోయి నేలలో కలసిపోతాయి.


పంటల అవశేషాలకు నిప్పు పెడుతున్న రైతు

రైతులు కాలుష్యాన్ని తగ్గించేందుకు కృషి చేయాలి

రైతులు తమ పంటను పొలంలో కాల్చకుండా ఆదే పొలంలో పూడ్చి వేయడంతో పొలంకు బలం వస్తుంది. పోషకాలు పెరుగుతాయి. ఆదోని డివిజన్ ప్రాంతంలో ఎక్కువ మంది రైతులు తమ పంటలను కాల్చడం అవాటుగా మార్చుకున్నారు. దీంతో పొలంలో పోషకాలు కాలిపోతాయి.

\- మహ్మద్ ఖాద్రీ, ఏడీఏ, ఎమ్మిగనూరు

